# భక్తి రసాయనము 1

శాంతిశ్రీ
జంధ్యాల వేంకటేశ్వరశాస్త్రి

# భక్తి రసాయనము

మధుసూదన సరస్వతి యతి సంస్కృత లక్షణ గ్రంథమునకు

తెలుగు వ్యాఖ్య

"శాంతిశ్రీ"

జంధ్యాల వేంకటేశ్వరశాస్త్రి

ప్రశాంతి నిలయము

సర్వస్వామ్యములు రచయితవి
ప్రథమ ముద్రణము 1995
ప్రతులు వెయ్యి

వెల 6 రు.

ఆర్ష ధర్మ ప్రచారకులైన తిరుమల తిరుపతి దేవస్థానముల వారి ఆర్థిక సహాయముతో ప్రచురింప బడినది.

ప్రతులకు
"శాంతిశ్రీ"
జంధ్యాల వేంకటేశ్వరశాస్త్రి
రెస్ట్ బ్లాక్ వెనుక లైన్
ప్రశాంతి నిలయము
అనంతపురంజిల్లా

ముద్రణ
ఆంధ్రా ఆర్ట్ ప్రింటర్స్
కాకినాడ - 1

శ్రీ శ్రీ శ్రీ సత్యసాయి భగవంతుని

సప్తతి జన్మదినోత్సవ సందర్భముగా

స్వామి పాదపద్మములపై

సమర్పితము

\- కాంతిశ్రీ

[illegible]

[illegible]

[illegible]

బాబా

# భక్తిరసము - అభినందన

"విద్వత్కవి" "కవితాభూషణ"
శ్రీ పెంవకాల సూర్యనారాయణశాస్త్రి

"కవితా కల్యాణి మా యింటిలో నిరతమ్మున్ కలమంత్రముల్ పలుకు...." అనిన పసిడి పలుకుననే శ్రీ జంధ్యాల వేంకటేశ్వరశాస్త్రి కాంతిశ్రీ అవ్యక్త హృదయ మాధుర్యము వెల్లడియైనది. ఇది వారి కవితా కల్యాణికి రతనాల నీరాజనము. వారి లేఖిని నుండి వెలువడిన వాక్యముల అందచందములు చూచి చదివి ఆనందించ వలసినదే. కాని అట్టిట్టు అనుటకు మాదృశులకు అసాధ్యములని వీరి త్యాగమయి అనురత్నము పంది కృత్యా విష్కరణ నాటి నుండియు నేను పూర్తిగా ఎఱుంగుదును.

ఆ తరువాత వెలువడిన 'ఉదాహరణత్రయి' 'సుందరమందారము' 'నారద భక్తిదర్శనము' అనెడి కృతిత్రయ మందలి అమృతరసము గ్రోలి పొందిన పారవశ్యములో ఏమి వ్రాసినను ఎంత పొగడినను అవన్నియు అపర్యాప్తములే యగును. చిరకాలమైత్రీ ప్రేరణమున దావలాయ ప్రబోధితుడను యగుచు యిది యేదో వ్రాయుచున్నాను.

"ఉదాహరణత్రయి" చూచినపుడు కవికుల గురువు కాళిదాసు రచించిన మహత్తర శ్లోక రాజము

"ఏకైకమూర్తిర్బిదభేదే త్రిధాసాం
సామాన్య మేషాం ప్రథమా వరత్వమ్"

నాకు స్ఫురణకు వచ్చి ఆనందం కలిగినది. ఇందుగల మూడు ఉదాహరణలు పరిశీలింపగా ప్రథమము మధ్యమము తుదయులగు శారద- సత్యసాయి- విశ్వనాథ అందుకు ఎంతయో యోగ్యులు యనిపించినది. ఈ నిశ్చయమును యెవరు కాదనగలరు! ఇది ఉత్తమ జాతి కావ్యము.

"సుందర మందారము" జంధ్యాల వారింటి కవితా కల్యాణి గొంతెత్తి పాడిన గేయ సరసిపై విరిసిన పుష్పమంజరి. సుందరే కిం న సుందరమ్! అను వచనమునకు దృష్టాంతముగా అత్యంతము మందరాతి సుందరమై సాగినది కృతి. అఘటన ఘటనా పటుతైన కవిబ్రహ్మ చేత బట్టిన యేది సుందరము కాదు! కావ్యమంతయు రసమయమై రమణీయమై హృదయంగమమై యొప్పారినది.

శాస్త్రిగారి 'నారదభక్తి దర్శనము' మథాకపుంజాల భత్నం. ఇది శాస్త్రి రచనలలో మూర్ధన్యము అని నేను భావించుచున్నాను. శ్రీ శారదుల వారు భక్తిని గూర్చిచెప్పిన శాస్త్రమిది యని స్ఫురించునట్లు శాస్త్రి యీ గ్రంథమునకు 'నారద భక్తి దర్శనము' యని నామకరణ మొనర్చుటలో యెంతయో యౌచిత్యమున్నది.

పాణినే ర్జైమినేశ్చైవ వ్యాసస్య కపిలస్యచ
కణాద స్యాక్షపాదస్య దర్శనాని షడేవహి

యని యాస్తిక మతముల దర్శనములు యారు మాత్రమునని ప్రాచీనుల సూక్తి. ఇది 'యేడవ దర్శనము' యని నారదుల వారు యనకున్నను యేడవ దర్శనము వలె సాగినదీ గ్రంథము.

శ్రీ శాస్త్రి గారు నారద భక్తి సూత్రములను గూర్చి సంస్కృతము తెలుగు హిందీ మొదలగు దేశభాషలందు వెలువడిన పెక్కు వ్యాఖ్యానములను పరిశీలించి నారు. వీరు సూత్రములను ఉదాహరించుచు కొన్నిచోట్ల వార్తిక కారులవలె కొన్ని చోట్ల భాష్యకారులవలె యెన్నెన్నియో విమర్శలను జేర్చి యీ గ్రంథమునకు దర్శన ప్రతిపత్తిని కలిగించుట మిక్కిలి సమీచీనము ముదావహముకూడ నగు చున్నది.

ఇంతకు పూర్వము 'నారద భక్తి సూత్రములు' యను పేర బ్రహ్మశ్రీ నడిమింటి సర్వమంగళేశ్వరశాస్త్రిగారు ప్రతి సూత్రమునకు నొక్కొక్క పద్యము వ్రాసి శ్రీ చెన్నమల్లేశ్వరస్వామికి కృతి సమర్పణ చేసినారు. తుది భాగములో 'భక్తివలన ముక్తి' యను శీర్షికనుంచి భక్తిని పొందుటకు మార్గములు 'భక్తిరసాయన' గ్రంథములోని యొకటి రెండు శ్లోకములను భాగవత పద్యములను యుదాహరించి గ్రంథ పరిసమాప్తి గావించినారు.

కానీ శాస్త్రిగారు భక్తిని సామాన్యులకు కూడ బోధింపవలెనను సుబుద్ధితో ఈ గ్రంథమును విస్తారముగా విశదీకరించినారు. జ్ఞానకర్మ యోగముల కంటె భక్తిలోగల శ్రేష్ఠతను పరిపరి విధముల బహు గ్రంథప్రమాణములతో నిరూపించి నారు. ఇది అసామాన్య విషయము.

ప్రస్థాన భాష్యత్రయము వెలువరించిన జగద్గురు శంకరాచార్యులవారు 'వివేకచూడామణి'లో 'మోక్షసాధన సామగ్ర్యాం భక్తిరేవ గరీయసి' అని భక్తికి మిక్కిలి ప్రాధాన్యమిచ్చియున్నారు. 'అనురక్తి భరేశత్వే భక్తిరిత్యభిధీయతే' పర

బ్రహ్మంపై ప్రీతియే భక్తి అని సకల శాస్త్రోక్తము. ఏమంత శ్రీశంకరాచార్య శివానంద లహరిలోపల వారు భక్తిని యుపాసించు యుపాయములను పెక్కింటిని బోధించి నారు.

భక్తి యనయది యొక మనోవ్యాపారము. మనస్సును పరమేశ్వర పాదార విందములందే లగ్నమొనరించుట భక్తుల పరమావధి. అందుకు ఆదిశంకరులు అనేక యుదాహరణములను చూపించినారు. ఊడుగ వృక్షములు తల్లాపెదరైన తన విత్తనములను మేఘములురిమినంతనే తన దగ్గరకు ఆకర్షించుకొనును. అయస్కాంతము లోహపుతునకలను వేగముగా తనకడకు లాగుకొనును. పతివ్రత యెన్ని కష్టములైనను యెదుర్కొని తన ప్రాణపతిని విడువక చేరియుండును. లతలు వృక్షములను ఆశ్రయించి మెలవేసికొని వృక్షాగ్ర భాగముల హసించును. నదీమతల్లులు కొండలు కోనలుగమించి క్రమించి ప్రాణనాథుడైన సాగరునికూడి తదాకారము పొందును. అట్లే భక్తుల మనోవృత్తి పరమేశ్వరపాదారవింద సమర్పన గావించుచుండును. ఇది భక్తి ప్రవృత్తి. ఇట్లు అసంఖ్యాకంగా ఆచార్యులవారు దృఢ భక్తినిగూర్చి యుపమాన సహితముగా చెప్పుకొనుచూ వచ్చినారు.

భక్తిని గూర్చి చెప్పిన వారిలో శ్రీ మధుసూదన సరస్వతి యతిగారు యగ్రేసరులు. వారి "భక్తి రసాయనము" బహు ప్రశంసలందిన యుత్తమోత్తమ గ్రంథ రాజము. దానిని తెలుగులో వ్యాఖ్యానించి శాంతిశ్రీగారు భక్తులకు నెనలేని యుపకారము గావించినారు. నారద భక్తి దర్శనమునకు సమస్కంధము వీరి యీ భక్తి రసాయనము!

శ్రీ మధుసూదన సరస్వతిగారు "రసోవైసః" అను శ్రుతి వాక్యమును నాధారము జేసికొని రసము అనగా పరమాత్మయే అని నిశ్చయించి నిరూపించినారు. వీరు భక్తిరసము నవరసములలో నంతర్వాహిని యని వివరించి, మరియు అది యొక ప్రత్యేక రసరాజమని వక్కాణించి భక్తి రసమునకు పట్టాభిషేకము చేసినారు. భక్తి రసమునకు యాలంబము విభావము భగవంతుడైన శ్రీకృష్ణుడని భాగవత గ్రంథమును ప్రమాణముగా దృఢీకరించినారు. అనుభావ విభావ వ్యభిచారి భావాదులను కృష్ణ చరిత్రనుండి యెత్తిచూపించినారు. భక్తి భావములలో ఒకటి మాత్రమే యను పండిత ప్రకాండులను తృణీకరించి భక్తి రసము యని యొప్పించినారు.

శోక క్రోధ భయాదీనాం [illegible]దినామ్
రసత్వ మప్యపగతం తదానుభవ మాత్రతా

ఇహాముత్ర విద్ధత్వే సహస్రగుణితో రసః
ఇతేనైవ త్వయా తస్మాత్ కస్యా భవలవ్యతే

శోకము క్రోధము భయము మొదలైనవి సాక్షాత్తుగా యానందమునకు విరోధులు. అయినను పండితులు ఈ శోకాదులకు రసత్వమును నాపాదించి అంగీకరించియున్నారు. అట్టి కోవిదులకు యీ శోక క్రోధాదుల కంటె వేయిరెట్లు గొప్పదియు, ఆనందము-భగవద్రతి కలిగించునదియు, పరమపద ప్రభావయుతమయినదియు, నయిన భక్తిని రసము కాదని చెప్పుట యెట్లు సమర్థనీయమో తెలియకున్నది.

ఇతర దేవతలు జీవమాత్రులు. వారియందు మహారసానందము సంభవింపక పోవచ్చు. కానీ పరమానంద స్వరూపుడు పూర్ణావతారుడు అయిన శ్రీకృష్ణ భగవానుని యందు రసత్వము లేకపోవుట యెట్లు? పూర్తి లౌకికమైన శృంగార హాస్యాదులు భగవద్రతి రసస్థాయిని యందుకో లేవు కానీ కృష్ణ విషయిక శృంగార రసాదులు భక్తిగా పరిణమించక పోవుటెట్లు! భక్తి పరిపూర్ణ రసము. పరమ రసము. ఆనంద రసము. క్షుద్రములగు యితర రసములకంటె భక్తి పరిపూర్ణ రసమని దీనిని సూర్యకాంతి తోడను యితరములను మిణుగురు పురుగుల తోడను పోల్చటమైనది.

ఇట్టి భక్తి సర్వరస శిరోభూషణమైనది. ఈ 'భక్తి రసాయనము' ను శ్రీ శాస్త్రిగారు సర్వులకు సుబోధక మగునట్లు తెలుగున వ్యాఖ్యానించినారు. వీరి పరిశ్రమకు ఆంధ్రజాతి యంతయు చేయెత్తి మ్రొక్కినను ఋణము తీరునది కాదని భావించుచున్నాను. ఇట్టి వార్ధక దశయందు అలభ్య పుణ్యయోగముగ యీ భక్తి రస విషయ విచారమున నన్ను ధన్యునిగా నొనర్చినారని శాంతిశ్రీని మనసారా యభినందించుచున్నాను. ఆశీర్వదించుచున్నాను.

- ఇతి శమ్ -

శ్రీ మధుసూదన సరస్వతి యతి

# జీవనరేఖలు

శ్రీ మధుసూదన సరస్వతి వంశ మూలపురుషుడు వేద వేదాంగ విజ్ఞాన శాస్త్ర పారంగతుడు కోవిదుడగు 'శ్రీరామమిశ్ర'. ఈవంశీయులు సుప్రసిద్ధ బ్రాహ్మ ణులు. వీరు మిథిలాపురి ప్రాంతంలోని నవద్వీపంలో నివసిస్తుండేవారు. వీరందరు సాంగస్వాధ్యాయ నైష్ఠిక ప్రవరులు.

శ్రీ మధుసూదన సరస్వతి తండ్రి పురోదన పురందరుడు. శ్రీ పురోదన పురందరునకు నలుగురు పుత్రులు. అందు జ్యేష్ఠుడు శ్రీ నాథచూడామణి. ద్వితీయుడు యాదవుడు. తృతీయ పుత్రరత్నం శ్రీ మధుసూదన గోస్వామి. చతుర్థ సుతుడు వాగీశగోస్వామి. వీరు బెంగాల్‌లోని ఫరాద్‌పూర్ జిల్లాలోని 'కోటాలి'లో నివసిస్తుండేవారు. వీరు 16, 17 శతాబ్ది మధ్య కాలంలో జీవనయానం చేసినట్లు తెలుస్తోంది.

తృతీయ పుత్రరత్నమైన మధుసూదన గోస్వామి ఆశ్రమ స్వీకార దీక్షా నామం శ్రీ మధుసూదన సరస్వతి యతి వీరు విశ్వవిఖ్యాతి గాంచియున్నారు. వీరు బాల్యమందు పితృపాదుల సన్నిధిలో కావ్య వ్యాకరణ సాహిత్య శాస్త్రాలు అధ్యయనం చేశారు. న్యాయ శాస్త్రం శ్రీ హరిరామ తర్క వాగీశ్వరుల వద్ద పఠించారు. అద్వైతశాస్త్రం శ్రీరామతీర్థగారి వద్దనూ అధ్యయనం చేశారు. వీరు గూఢార్థదీపిక అని గీతపై గ్రంథంవ్రాసి ఆశ్రమ గురుపరీక్షలో నెగ్గి శ్రీ శ్రీవిశ్వే శ్వర సరస్వతి ద్వారా సన్న్యాసాశ్రమం స్వీకరించారు. వీరు గౌరాంగ మహా ప్రభు సాంప్రదాయకులు. కృష్ణ భక్తులు. పూరీ జగన్నాథస్వామి పదారాధకులు. వీరు చింతామణి టీకాకారులైన శ్రీ గంగాధర చక్రవర్తికి సహపాఠి.

"కృష్ణాత్ పరంకిమపి తత్త్వం అహం నజానే" "దాసీకృతా గోపవధూ విటేన" కాలిందీ పులినేషు యత్కిమపి తన్నీలం అహో! ధావతి" ఈ మొదలైన శ్లోకాలు వారి కృష్ణ భక్తికి నికషోపలాలు. 'భక్తి రసాయనము' వీరి భక్తికి మణి కిరీటం.

శ్రీ మధుసూదన సరస్వతికి సమకాలీన భక్తులతో గాఢ సంబంధం ఉండేది అందుకు కొన్ని ఉదాహరణలు - 'రామచరితమానస' కావ్యకర్త శ్రీ గోస్వామి తులసీదాసును అసూయాగ్రస్త పండిత ప్రభువులు విమర్శిస్తుండేవారు. తులసీదాసు మధుసూదన సరస్వతి ఇలా మాట్లాడుకోసాగారు-"సరస్వతీ! విన్నావా!

హరిహరయశ సురనరగిరా వరణహింసంత సుజానా
హాండీ హాటకదారు రుచి రాంధే స్వాద సమానా

హరిహరాదుల గొప్పతనం సుర గిరాంశితులకు తెలిసినట్లు ఇతరులకేం తెలుస్తుంది. పాయసం రుచి పాత్రలో తిరిగే గరిటకేం తెలుసుకనుక!" అన్నాడు తులసి. అది విని సరస్వతి ఇలా చెప్పారు-

ఆనందకాననేస్మిన్ తులసీజంగమస్తరుః
కవితామంజరీయస్య రామభ్రమరచుంబితా

తులసీ! కాశిలో కళకళలాడుతూ తిరిగే కల్పవృక్షం నీవు. ఆ తులసీ వృక్ష కవితా మంజరిని శ్రీరామభ్రమరం తడవతడవకు చుంబించి ఆస్వాదిస్తోంది. రాముడు మెచ్చిన రమణీయ జీవనం నీది. ఇతరులతో పనేమి! అన్నాడు సరస్వతి.

ఈ సంఘటన 1584లో జరిగింది. తర్కశాస్త్ర కోవిదుడు మహా విద్వాంసుడు సహపాఠి అయిన శ్రీ గదాధర భట్టాచార్య శ్రీ మధుసూదన సరస్వతితో వాదించి ఓడిపోయాడు. సరస్వతి నవద్వీపం వస్తున్నాడు అంటే ఈయనకు హడలుగా ఉండేదట-

నవద్వీపే సమాయాతే మధుసూదనవాక్పతౌ
చకంపేతర్కవాగీశ కాతరోzభూద్గదాధరః

అక్బరు దర్బారులోని సర్వపండిత మండలి అనాడు శ్రీ సరస్వతిని ఇలా ప్రశంసించింది-


వేత్తిపారం సరస్వత్యాః మధుసూదన సరస్వతీ
మధుసూదన సరస్వత్యాః పారంవేత్తి సరస్వతీ!

★ ★

ఈ పుస్తక ప్రచురణకు ఆర్థిక సహాయం అందించిన శ్రీ వేంకటేశ్వర స్వామికి నా హృదయ పూర్వక ప్రణామాలు. తిరుమల తిరుపతి దేవస్థానముల కార్యనిర్వహణాధికారి గారికి. సప్తగిరి సంపాదకులకు నా ధన్యవాదములు.

ఉదయ సాయం సంధ్యా సమయాలలో అద్భుతమైన దర్శనం ప్రసాదించే కదిలే దేవుడు, పలికే దేవుడు, చిరునవ్వులు చిందించే దేవుడు, నన్ను నడిపించే దేవుడు శ్రీ సాయి శ్రీనివాసుడు! ఆ సత్యసాయి భగవంతుని పాదపద్మముపై ఈ భక్తి రసాయనాన్ని సమర్పిస్తున్నాను.

- శాంతిశ్రీ



[illegible]

# రసో వై సః

ఆనందం గూర్చి ఆలోచించినపుడు "తైత్తిరీయం"లోని "బ్రహ్మానందవల్లి" స్ఫురిస్తుంది. లోకంలో చక్రవర్తి వంటి పూర్ణారోగ్యవంతుడు సాధు పురుషుడు పొందే ఆనందం మానుషానందం. ఈ మానుషానందం కంటే మనుష్య గంధర్వానందం - పితృ దేవతానందం - అజాన దేవతానందం - కర్మ దేవతానందం - దేవతానందం - దేవేంద్రానందం - బృహస్పత్యానందం - ప్రజాపత్యానందం - బ్రహ్మానందం ఒకదాని కంటే మరొకటి నూరు రెట్లు గొప్పవి. ఈ ఆనందములలో చరమానందం బ్రహ్మానందం. ఇది ఉత్తమోత్తమానందం. ఈ ఆనందంతో సమానమైనది "రసానందం"

"రసోవై సః" "రసం హ్యేవాయం లబ్ధ్వా నందీ భవతి" అని శ్రుతి. సర్వేశ్వరుడు రసస్వరూపుడు. రసం సర్వత్ర వ్యాప్తమైయున్నది. రసం లేని చోటు లేదు. రసం సర్వ జీవప్రాణ రసం. రసం గుణదాయి. ప్రాణదాయి. రసం కాంతిదాయి. శాంతిదాయి. రసం రుచిరం "రస్యతే ఇతి రసః' ఇది లోకంలో సహృదయులచే ఆస్వాదింపబడుతుంది.

సవై రస ఇతి శ్రుత్యా బ్రహ్మణః సమ కక్ష్యయా
ప్రోక్తః రసస్స్వయం భాగ్యాత్ కైశ్చిదేవానుభూయతే

ఈ రసానందం వేద తుల్యమైనది. ఇది బ్రహ్మానంద సమం. ఇది ఆస్వాదించేది కొందరు అదృష్టవంతులు మాత్రమే. రసం ఎరిగిన వారు రసజ్ఞులు. రసం ఎరుగనివారు రసహీనులు. రసం అనుభవించువారు సరసులు. వీరు ఏస్థితిలోనూ మారరు. వీరు సదా సరసులే. సాక్షరులు అయితే పరిస్థితులు మారినపుడు వారు రాక్షసులు అవుతారు - కేవలం సాక్షరులను నమ్మరాదు.

సాక్షరా విపరీతాశ్చేత్ రాక్షసా ఏవ కేవలమ్
సరసో విపరీతోపి సరసత్వం న ముంచతి

సాక్షరా X రాక్షసా సరస X సరస ఇది రసం గలవారికీ రసం లేనివారికీ గల తేడా. కనుక సర్వులు సరసులు కావాలి. రసహీనులు కారాదు. మానవునకు సరసత్వం ముఖ్యం.

సర్వులకు హితం కూర్చేది సాహిత్యం - సజ్జన సాగత్యం, నిత్య సత్య సాంగత్యం కలిగించేది సాహిత్యం. సాహితీ వరులు రసగ్రహణ పారీణులు అయినప్పుడే లోకకళ్యాణం. సాహిత్యంలో రసం వృద్ధిచెంది రసం రసాలమై మధురరసాలను అందిస్తుంది. సాహితీ రసాలం శాఖోపశాఖలుగా విశ్వంనిండా విస్తరించింది.

"ఇత్థంచ అభినవగుప్త మమ్మట భట్టాది
గ్రంథ స్వారస్యేన" భగ్నావరణ చిద్విశిష్టో
రత్యాది స్థాయిభావో రస" ఇతి స్థితమ్
వస్తుతస్తు వక్ష్యమాణ శ్రుతి స్వారస్యేన
రత్యాద్యవచిన్నా భగ్నావరణా చిదేవ రసః
సర్వథైవ చాస్యా విశిష్టాత్మనో విశేషణ విశేష్యం
వాచిదంశమాదాయ నిత్యత్వం ప్రకాశత్వం చసిద్ధమ్

—రసగంగాధరం జగన్నాథ పండిత రాయలు

అభినవగుప్త మమ్మట భట్టాదుల గ్రంథస్వారస్యం అనుసరించి "అజ్ఞాన రూపావరణ రహితమైన చైతన్య స్థాయి భావమే రసం" అని ఒక పక్షం. వాస్తవానికి శ్రుతిని అనుసరించి "రత్యాది స్థాయి భావసహితమైన నిరావరణ చైతన్యమే రసం" అని మరొక పక్షం ఈ రెండు పక్షాలలోనూ విశిష్ట రసానికి విశేషణంగా విశేష్యంగా ఉండే చైతన్యాంశను బట్టి నిత్యత్వం ప్రకాశత్వం సిద్ధిస్తుంది "వ్యంజకాలైన విభావాదుల వలన స్థాయి భావం వ్యంగ్యమై రసస్వరూపం దాలుస్తుంది" అనే భరతాచార్యుని రస సూత్రానికి అభినవగుప్తుని వ్యాఖ్యానమే సరియైన సమాధానం.

రస సంఖ్యను గూర్చి పండితుల విభిన్న అభిప్రాయాలు : :

1. 'స్వదితొవమ్య' వాదంద్వారా రసం ఒక్కటే దాని స్థాయిభావం ఆనందం అన్నాడు అలంకార కౌస్తుభ కర్త కవికర్ణపూర గోస్వామి.

2. రసోత్పత్తికి హేతువులయిన 'మూల భూతరసస్థానాలు శృంగార రౌద్ర వీర బీభత్సములు నాలుగు మాత్రమే' అన్నాడు భరతాచార్యుడు.

3. శృంగారం, హాస్యం, కరుణం, రౌద్రం, వీరం, భయానకం, బీభత్సం, అద్భుతం అని రసాలు ఎనిమిదే అన్నాడు భరతముని యే మరొకచోట.

4. మరింకొకచోట నాట్యశాస్త్రంలోనే శృంగారం. హాస్యం, కరుణం, రౌద్రం, వీరం, భయానకం, బీభత్సం, అద్భుతం, శాంతం తొమ్మిది రసాలు అన్నాడు భరతాచార్యుడే.

5. ఈ తొమ్మిదిగాక స్నేహం-స్థాయిభావం ప్రేయస్సు రసంగా రసాలు పది అన్నాడు కావ్యాలంకారకర్త రుద్రటుడు.

6. వాత్సల్యం రసం, ప్రేమయుక్త రతి స్థాయి భావం అన్నాడు విశ్వనాథ పండితుడు.

7. మాయా రసం మిథ్యాజ్ఞానం స్థాయిభావం అని ప్రతిపాదించాడు రసతరంగిణి కర్త భానుదత్తుడు.

8. భక్తిరసం, భగవద్రతి స్థాయిభావం అన్నాడు ఉజ్వల నీలమణి కర్త శ్రీ రూపగోస్వామి. 'భక్తిరేవగరీయసి' అన్నాడు శంకరాచార్యులు.

9. రసాలు అనంతాలు వల పదితొమ్మిది భావాలు రసాలే సుమా! అన్నాడు భట్టలోల్లటుడు.

10. భక్తి నవరసాలలో మిళితమై అంతర్వాహినిగా ఉంటుంది. మరియు భక్తి రసం కేవలం ప్రత్యేకరసంగా రసరాజంగా ప్రకాశిస్తున్నది. అని శ్రీ మధుసూదన సరస్వతి వివరించాడు అదే భక్తిరసాయన మహా గ్రంథరాజం

భాగవత భక్తిరసం వ్యాఖ్యానిస్తూ వంశీధర పండితులు ఇలా వివరణ ఇచ్చారు - భక్తి ద్వివిధం వైధీభక్తి, రాగానుగాభక్తి. వైధీభక్తి అంటే శాస్త్రవిధ సమ్మతంగా భయభక్తులతో ఆచరించే భక్తి. దీనికి ఋష్యాదులు ధర్మ తత్పరులు రుక్మిణ్యాదులు ఉదాహరణప్రాయులు.

రాగానుగాభక్తి అంటే పూర్ణాహృదయానురాగంతో తన్మయులై నిష్కా-మంగా నిస్వార్థంగా జరుపుకొనే భక్తి దీనికి వ్రజకాంతలు ఉజ్జ్వల ఉదాహరణ ప్రాయులు. మోక్షాపేక్ష గలవారిలో ప్రేమ భావరాహిత్యము, ప్రేమభావ ప్రతిబింబాలు మాత్రమే కనిపిస్తుంటాయి. కానీ కృష్ణ ప్రేమ గలవారిలో ప్రేమ భావమే ప్రదీప్త మవుతుంది.

దేవతలందరిలో అతి విశిష్ట విలక్షణమూర్తి శ్రీ కృష్ణదేవుడు. మిగిలిన దేవ తారాధనలకంటే శ్రీ కృష్ణారాదన ప్రధానమైనది. కృష్ణ నామంలో గల విశేషమైన అర్థాలు ఇవి – కృష్ణపదం గూర్చి "గర్గసంహిత" ఇలా పేర్కొన్నది.
కకారం కమలాకాంతుడు. ఋకారం శ్రీరామచంద్రుడు. షకారం షడ్గుణైశ్వర్యపతి. ణకారం నరసింహుడు. విసర్గలు నరనారాయణులు. ఇందరు కలసిన సర్వదేవతా స్వరూపుడు శ్రీకృష్ణ భగవానుడు. కృష్ణదేవుడు పరిపూర్ణ అవతారమూర్తి.

శ్రీకృష్ణ దర్శనం ఒకయోగం – కృష్ణ దర్శనం అసలు లేనిది అయోగం. కృష్ణ దర్శనం కొంత కాలం కలిగి కొంత కాలం లేనిది వియోగం. సాధారణంగా కౌమారం ఐదు సంవత్సరముల వరకు పౌగండం పది సంవత్సరముల వరకు. కైశోరం పదునైదు సంవత్సరముల వరకు. మహామహుల విషయంలో ఈవయః పరిమితులు మారుతుంటాయి. కృష్ణదేవుని 'కౌమారం' నాలుగేండ్ల వరకే. పౌగండం ఎనిమిదేండ్ల వరకే. 'కైశోరం' పదేండ్ల వరకే. అయినా కృష్ణుడు నిత్య కిశోర మూర్తియే. సనకసనందాదులు నిత్య పంచవర్ష ప్రాయులే. శౌనక మహర్షి సదా షోడశవర్ష ప్రాయుడే. దేవతలు ఎల్లపుడూ త్రిదశులే.

శ్రీకృష్ణుడు పౌగండ ప్రాయంలోనే రాసక్రీడలు జరిపాడు రాసక్రీడలోని గోపికలు నూరుకోట్లు. కృష్ణ దేవుడు గోపికలందరకు అన్ని రూపాలలోనూ వేరు వేరుగా ప్రత్యక్షమైనాడు. శ్రీకృష్ణుడు నిత్య బ్రహ్మచారి. ఈదేవుని అవతార కాలం నూట ఇరువదైదు సంవత్సరముల ఏడు మాసాల ఎనిమిది దినాలు అని భాగవత వచనం. అయినా కృష్ణమూర్తి నిత్య కిశోరమూర్తియే.

కామం వేరు లౌకిక కామం వేరు. ప్రేమ వేరు. కామం అకాంక్ష అనేఅర్థంలో వాడినపుడు అయాకాంక్ష పారమార్థిక మైనప్పుడు పవిత్రం. లౌకిక కామం అయిన పుడు పశువుల 'గ్రామ్య కర్మ' లేక 'సురతం' అవుతుంది. ఈ సురతం కూడా

ధర్మపత్ని సంబంధితం వరకు గ్రహణీయం. సంకుచిత కామం శారీరక సంబంధం అయినపుడు స్త్రీ పురుషులు నిర్వీర్యులు అవుతారు. ప్రేమ నిత్యం. విశ్వవిశాలం దీని వలన నిత్య యౌవనం లభిస్తుంది. కామం వలన బ్రహ్మచర్యము నశిస్తుంది. ప్రేమ వలన బ్రహ్మచర్యము వృద్ధి అవుతుంది. సంభోగం అనగా సమ్యక్ భోగం. ఇక్కడ సాధారణ మిధున కర్మకాదు. సంభోగం పరిపూర్ణ అనురాగం ఆత్మానందం ఇదే ఆత్మరతి.

స్థాయిభావభక్తి త్రివిధం 1. సామాన్యభక్తి 2. స్వచ్ఛభక్తి 3. శాంత్యాదికభక్తి. సామాన్యభక్తి అనగా భజనలు – పూజలు – వ్రతాలు చేయునట్టిది. స్వచ్ఛభక్తి అనగా మానసార్చనచేయుట ఇదే పరమభక్తి, అనన్యభక్తి. శాంత్యాదిక భక్తి అయిదు విధాలు 1. శాంతం 2. దాస్యం 3. సఖ్యం 4. వాత్సల్యం 5. ఉజ్జ్వలం లేక శృంగారం - మధురం

1. శాంత రసం ఋష్యాదులలో వ్యక్తమవుతుంది. శాంతం రసంగా శ్రీ మధుసూదన సరస్వత్యాదులు అంగీకరించలేదు. కానీ భక్తిరస వ్యాఖ్యాత వంశీధరులు భక్తికి శాంతం - దాస్యం - సఖ్యం-వాత్సల్యం - శృంగారం ముఖ్యమైన రసాలుగా పేర్కొన్నారు.

2. దాస్యభక్తి రసంలో భక్తులు నాలుగురకాలు. ప్రేమ, రాగం, స్నేహం కలిసింది దాస్యభక్తి.

1. అధికృత భక్తులు–బ్రహ్మ ఇంద్ర మహేశాదులు. 2. శరణ్య భక్తులు– కాళీయ ఉగ్రసేనాదులు. 3. పార్షదులు–ఉద్ధవ దారుకాదులు 4. అనుగాములు– బృందావన వ్రజ గోకులవాసులు

మరియొకరకం 1. ధుర్యభక్తులు:- పరివారంతోగల సాంసారిక భక్తులు. 2. ధీర భక్తులు - నాయికానాయక సేవానిరతులు 3. వీరభక్తులు:- కృష్ణునితప్ప ఇతరులను గణించనివారు 4. ప్రేమగౌరాంగ భక్తులు;- ప్రద్యుమ్నసాంబాదులు

3. సఖ్య భక్తిరసంలో భక్తులు వీరూనాలుగు విధాలు.

1. సుహృదులు - పూజ్యులు వృద్ధులు

2. సఖులు — వయస్కులు విశాల ఋషభాదులు

3. ప్రియసఖులు - సమవయస్కులు శ్రీదామ సుదామ వసుదామాదులు
4. నర్మసఖులు - అర్జున మధు మంగళాదులు

4. వాత్సల్య భక్తిరసంతో నంద-యశోద-రోహిణి-ఉపనందులు ఉపనంద సతులు. కుంతి మొదలగువారు పునీతులయినారు. ఈరసాలకు ప్రధాన విషయాలంబనం, బాలకృష్ణ పరబ్రహ్మం. ఆశ్రయాలంబనం భక్తకోటి, అనుయాయులు. ఉద్దీపనం శ్రీకృష్ణ విహారప్రదేశాలు. నివాసాలు వ్రజభూములు అనుభావాలు, ప్రేతలు వారి చేతలు, క్రీగంటి చూపులు. సాత్త్వికభావాలు హర్షబాష్పాలు, ఘర్మ బిందువులు, గగుర్పాటు. వ్యభిచారీ భావాలు శ్రమ, కంపం.

శాంతం-దాస్యం-సఖ్యం-వాత్సల్యం-శృంగారం ఇవి స్థాయి భావాలు. రసం శృంగారం. ఇది ఉజ్జ్వల మధుర రసం. ఈరతి త్రివిధం. ఈ రతులు మణుల వంటివి. 1. సాధరణీరతి-మణి 2. సమంజసారతి-చింతామణి 3. సమర్ధారతి-కౌస్తుభం.

సాధారణీరతికి-కుబ్జాదులు ఉదాహరణలు. స్వార్థం గలవారు. సమంజసారతికి-రుక్మిణ్యాదులు, స్వార్థమూ పరమార్థము గలవారు. సమర్ధారతికి-గోపికలు, కేవలం నిస్వార్థం-కృష్ణసుఖధ్యేయం గలవారు.

మధుర భక్తి ఈ విధంగా పోల్చబడింది–

మధుర భక్తి ఒక తియ్యని చెరుకుగడ. ప్రేమ చెరుకురసం. స్నేహం చెరుకు రసం వండిన బెల్లం. మధుస్నేహం మంచిబెల్లం. ఘృత స్నేహం కలకండ. మానం పంచదార దేశవాళి. రాగం చీనీ పంచదార. అనురాగం పటిక బెల్లం. మహాభావం శారీన్. ప్రణయంతో మనస్సు దేహం ఇంద్రియం మిశ్రితం మోదనమాదన ప్రణయ మిశ్రమం మహాభావం.

ఇది భాగవత దృష్టి. ఇది భక్తిరస సారాంశము.

శ్రీ మధుసూదన సరస్వతి సాహిత్యకీతులు అన్నీ పరిశీలించి భక్తిరసాలను మిశ్రమం చేసి మధుర రసాయనం తయారుచేసి అందించారు. ఆ భక్తి రసాయనాన్ని నా శక్తికొలది శ్రీ సత్యనారాయణాచార్యులు అనుగ్రహించినట్లు తెలుగు చేశాను సుధీమణులు అవలోకింతురుగాక!

— శాంతిశ్రీ

# సామాన్య భక్తియోగం

నవరసమిళితంవా కేవలంవా పుమర్థం
పరమమిహ ముకుందే భక్తి యోగం వదంతి
నిరుపమసుఖ సంవిద్రూపమస్పృష్టదుఃఖం
తమహ మఖిల తుష్ట్యై శాస్త్రదృష్ట్యా వ్యనజ్మి

శ్రీ మహావిష్ణు దేవుడు సర్వత్ర వ్యాపించి యున్న సర్వేశ్వరుడు. ఆ స్వామి మోక్షం ప్రసాదించే మురళీమోహనుడు. కనుక ఆ స్వామికి ముకుందుడని పేరు. ఇది ఆ ముకుందస్వామి భక్తి యోగం. ఇది నవరస సమ్మిళితమైన రసాయనం. మరియు ఇది సర్వస్వతంత్ర రసరాజం. ఈ భక్తి రసాయనం పరమ పురుషార్థ ప్రదాయకం. ఇది పురుషోత్తమ యోగం. అని ముక్త పురుషులు ముక్త కంఠంతో కొనియాడారు. ఈ భక్తియోగం వలన అనుపమ సుఖాలు అపవర్గాలు ప్రాప్తిస్తాయి భవరోగ క్లేశాలు హరిస్తాయి.

ఇట్టి మహామహిమాన్వితమైన భక్తియోగాన్ని "భక్తి రసాయనం" చేసి సర్వజన సమ్మోదకరంగా సర్వశాస్త్ర సిద్ధాంత పరంగా వివరిస్తాను అని శ్రీ మధుసూదన సరస్వతి ప్రతిన చేసిన గ్రంధ రచనకు పూనుకున్నారు. సాహిత్య మహా కావ్యాదుల్లో శృంగార, హాస్య, కరుణ, వీర. రౌద్ర, భయానక, బీభత్స, అద్భుత శాంతాలను మాత్రం నవరసాలుగా పేర్కొన్నారు. "భక్తి వాత్సల్యాలు రసాలు కావు, వీటికి స్థాయిభావ మౌలిక శక్తులు లేవు. చిన్నవారిపై కనపరిచేది వాత్సల్యం పెద్దవారిపై చూపే వినయమే భక్తి. ఇవి భావాలు మాత్రమే రసాలు కావు" అని పండితులు వాదించారు. మొదట ఈ పండితులు లెక్క వేసింది ఎనిమిది రసాలే. తర్వాత శాంతం చేర్చి రసంగా అంగీకరించటం జరిగింది. "భక్తిరసం కాకపోవటం ఏమిటో? భక్తి ఒక్కరసం మాత్రమేకాదు నవరసాలకు ఆలవాలం. ఇది నవ రస మిశ్రిత ప్రాణరసం. ప్రత్యేక రసరాజం. ఇది రసాల వృక్షం." అని శ్రీ మధుసూదన సరస్వతి భక్తిరసాయనం తయారు చేసి చూపించారు. భావం లేనిదే రసం లేదు, ఇవి రెండూ పరస్పర ఆశ్రితాలు. భక్తిరసం లేక ఏ రసమూలేదు.

న భావహీనోస్తి రసో న భావరస వర్జితః
పరస్పరకృతాసిద్ధ రనయో రస భావయోః

## రసాయనం :

సంసారరోగేణ బలీయసా చిరం
విపీడితైః శర్మ్యశమేతి శిక్షితమ్
ఇదం భవద్భిః బహుధా వ్యయాతిగం
నిపీయతాం "భక్తిరసాయనం" బుధాః

ఓ బుధవరేణ్యులారా! ఈ సంసారం బహురోగాల మయం. వీటిలో ఎక్కువ దీర్ఘరోగాలు, మొండి రోగాలు. జననమరణ వ్యాధులు జనులను అనాది కాలం నుండి బాధిస్తున్నాయి. ఈ రోగ ఉపశమనం కోసం దివ్యౌషధం తయారు చేశాను ఎందరు సేవించినా తరగదు. ఇదిగో! ఇది "భక్తిరసాయ ం" భక్తిరసానికి ఆశ్రయస్థానమైనది. ఇది శక్తినీ భక్తినీ ముక్తినీ ప్రసాదిస్తుంది. ఇది బలవర్ధకౌషధం.

శ్రీ కపిల దేవుడు దీనినిగూర్చి తల్లితో ఈ విధంగా అన్నాడు. "అమ్మా! నా గుణశ్రవణం వలన ఉదాత్త మానసం కలిగిన వారు సముద్రం జేరుకొనే గంగాదేవి వలె ఈశ్వరుడనైన నన్ను సంగమిస్తారు. నా భక్తులు అంటే నాకు చాలా యిష్టం. కనుక లోకంలో భక్తిరసానికి మించిన రసం మరొకటి లేదు. భక్తిరసం పానం జేయి తల్లీ!"

## భక్తి :

ద్రుతస్య భగవద్ధర్మాత్ ధారావాహిక తాంగతా
సర్వేశే మనసో వృత్తిః భక్తి రిత్యభిధీయతే

భగవద్ధర్మాలూ భగవద్గుణాలూ శ్రవణం మననం చేయటం వలన చిత్తం ద్రవీభూతమవుతుంది. ఈశ్వర ప్రేమ ధారావాహికంగా జాలువారుతుంది. నదీ ప్రవాహంవలె ప్రవహించి మానవ జీవనం పావనం జేస్తుంది. తైలధారవలె భక్తి స్రవించి ఆత్మజ్యోతిని వెలిగిస్తుంది. ఈ చిత్తవృత్తినే 'భక్తి' అంటారు.

ఈ భగవద్భక్తి రసరూపం దాల్చటం వలన పురుషార్థత సిద్ధిస్తుంది. హరి గుణ శ్రవణం వలన మనస్సు మాధవునివైపు ఆకర్షిత మవుతుంది. ధర్మబుద్ధి లగ్న మవుతుంది. మానవుడు క్రమక్రమంగా కామక్రోధాదుల అణచుకొని చిత్తం పరిశుద్ధం చేసుకోవాలి. మాధవ స్మరణలో మనుగడ సాగించాలి. భక్తియోగాన్ని

అనవరతం అభ్యాసం చేసుకోవాలి. ఇలా చిత్తవృత్తిలో మనస్సు స్వంతంగా నెలకొని ఉండాలి.

అపుడు సర్వత్ర సర్వేశ్వర ఆకారం వ్యావృతమవుతుంది. ఇలాంటి చిత్త వృత్తి కలుగనిదే భక్తి కుదరదు. ఇట్టి చిత్త వృత్తిలో తెరిపి కలిగిందంటే భక్తికి భిన్నం కలుగుతుంది. భక్తిధార ఈశ్వర విషయం కాకపోతే అది భక్తి కాదు. చిత్తద్రుతి, మానస ధారావాహిని, హరి భక్తి ఈ మూడూ ఏకీకృతమయితే పూర్ణ భక్తి అవుతుంది. నిర్గుణమైన ఈ భక్తిని నిర్వికారంగా నిశ్చలంగా నిష్కామంగా భక్తుడు ఉపాసించాలి, నిర్మలమైన భక్తితో. సజ్జనుల సాంగత్యం హరిగుణ శ్రవణం సంకీర్తనం నిరహంకారుడై చేస్తుండాలి. ఇదే పోతన తెలియచెప్పేడు భక్త లక్షణాలు-

హరి మంగళగుణకీర్తన<br>
పరుడై భగనార్ణవంబు-భగవత్పరులన్<br>
కరమనురక్తి భజించుట<br>
నిరహంకారమువనుంట నిశ్చలుడగుటన్!

## మనస్సు లక్కవంటిది

చిత్తద్రవ్యం హి జతువత్ స్వభావాత్కఠినాత్మకమ్<br>
తాపకై ర్విషయైర్యోగే ద్రవత్వం ప్రతిపద్యతే

లక్క సహజంగా కఠినంగా పెళుసుగా ఉంటుంది. అట్టిది నిప్పుసెగ తగిలితే మెత్తబడి కరిగిపోతుంది. ఈ తీరుగానే చిత్తం కూడా సహజంగా గట్టిగా ఉంటుంది. కానీ ఆ చిత్తానికి వాసనలు అనే సెగలు సోకితే మెత్తబడుతుంది. సామాన్యంగా కామక్రోధాది విషయాలు అనే వేడి వాయు సంయోగం చేత చిత్తం శైథిల్యం పొందుతుంది. చిత్తం ద్రవీభూతం కావటం వేరు. చిత్తం శైథిల్యం పొందటం వేరు. ధనదారా పుత్రాదులపై ఆసక్తి వేరు. భగవంతునిపై అనురక్తి వేరు. ఈ రెంటిలోనూ చిత్తం ద్రవిస్తుంది. కానీ రెండు ఆసక్తులలో భేదం ఉంది. భగవద్విషయికమైన ఆసక్తి వలన చిత్తం పూర్తిగా ద్రవిస్తుంది. సాంసారిక విషయమైన ఆసక్తి వలన చిత్తం సామాన్య శైథిల్యం పొందుతుంది. సాంసారిక విషయాలతో చిత్తం ద్రవించదు. తీవ్ర అగ్ని సంయోగం వలన ఇనుము పూర్తిగా కరిగి పోతుంది. సామాన్యసూర్యతాపానికి ఇనుము కరుగదు గదా! ద్రవీభూతం కావటం అంటే ఇదే.

## కామ క్రోధాదులు

కామ క్రోధ భయ స్నేహ హర్ష శోక దయాదయః
**తాపకా శ్చిత్తజతున స్తచ్ఛాంతౌ కఠినంతు తత్**

కామం క్రోధం భయం స్నేహం హర్షం శోకం దయాదులు చిత్తం అనే లక్కకు వేడి సెగలు. ఇవి సోకగానే చిత్తం స్థిరత్వం కోల్పోయి చలించి శైథిల్యం చెందుతుంది. ఇవి సోకకపోతే చిత్తం శుద్ధంగా స్వచ్ఛంగా నిర్మలంగా నిశ్చలంగా ఉంటుంది. కామ క్రోధాది విషయాలలో చిత్తం ఉద్రేకం చెందుతుంది. దీనిలో కూడా చిత్తం కొంత ద్రవిస్తుంది. ఇది శైథిల్యం. కామోద్రేకాలు సమాప్తం కాగానే చిత్తం ఉద్రేకం శాంతించి యథాప్రకార స్థితికి చేరుకుంటుంది.

అదే మనస్సు భగవదాసక్తమైతే సర్వ వేళల ద్రవీభూత స్థితిలోనే వుంటుంది. భగవదాసక్తి కొన్నాళ్లుండి పోయేదికాదు. అది శాశ్వతం. మహా మహిమాన్వితం. స్థిర చిత్తం గలవాడే భక్తుడు. కష్టాలకు నష్టాలకు భక్తుని చిత్తం చలించదు. అది హరి గుణ శ్రవణ సేవలందు ద్రవీభూతమయ్యే ఉంటుంది.

హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని మార్చటం కొరకు ఎన్నో శిక్షలు వేశాడు. కష్టాలు పెట్టాడు. హింసించాడు. బాధించాడు. అయినా భగవదాయత్తమైన ప్రహ్లాద చిత్తం చలించలేదు. హరి భక్తి వీడలేదు. తండ్రి విసిగి చంపించ బూనుకొన్నాడు.

ఒకమాటు దిక్కుంభి యూధంబు దెప్పించి
కెరలి బాలకుని ద్రొక్కింప పంపు
ఒకమాటు విషభీకరోరగ శ్రేణుల
కడువడి నర్భకు గరువ బంపు
ఒకమాటు హేతి సంఘోగ్రానలము లోన
విసరి కుమారుని వేయబంపు
ఒకమాటు కూలంకషోల్లోల జలధిలో
మొత్తించి బాలకు ముంచ బంపు
విషము పెట్టబంపు విదళింపగా పంపు
దొడ్డ కొండ తరుల ద్రోయ బంపు
పట్టి కట్ట బంపు బాధింపగా బంపు
బాలు గినిసి దైత్య పాలు డధిప!

ఇలా ఎన్ని ఇక్కట్లు పెట్టినా భక్తుని చిత్తం మారలేదు. ఇది భక్తుని లక్షణం.

## పాకవరి

> ద్రుతే చిత్తే వినిక్షిప్తః స్వాకారో యస్తు వస్తునా
> సంస్కార వాసనా భావ భావనాభిర్ద భాగబో

ద్రవీభూతమైన చిత్తం వస్తు భావనా ప్రభావం వలన పూర్తిగా ద్రవితమై ఏ వస్తువును భావించాడో ఆ వస్త్వాకారం ఆ వస్తు స్వభావం ఆ వస్తు వాసన సంస్కారం పొందుతుంది. కరిగిన లక్క మూసలో వస్తువురూపం దాల్చినట్లు పూర్ణ ద్రవిత చిత్తం భగవదాసక్తమైనపుడు రత్యాది అనేక భావాలతో పరిణమిస్తూ ప్రవహిస్తుంటుంది. ఈ మార్పు కూర్పులలో అది భగవదాకారంపై నిగ్గుదేలుతుందే కాని వశించదు. భగవద్భావం భక్తి మార్గంలో గమించి పరిమళించి నిత్యత్వంగా రాణిస్తుంది.

## కఠినీభావం

> కఠినీభావ మాత్రంతు మనోగచ్ఛత్యభావకైః
> న తత్ర వస్తు విశతి వాసనాత్వేన కించన

ఈ కామ క్రోధ ద్వేషాదుల వేడిగాడ్పులు భావం లేకపోతే ఒకవేళ మనస్సు చలించినా కుదుట పడుతుంది. మనస్సుపై వాసనా రూపమై ఏ వస్తువూ పనిచేయదు. ఈ కోప తాపాలు మనస్సుకు తగలవు. కాని కామ క్రోధాల వేడిమి వల్ల మనస్సు మారి పోతుంది. సూర్యుని వేడిమికి లక్క కొంచెం మెత్త పడుతుందే కానీ పూర్తిగా కరిగిపోదు. ఆ విధంగానే విషయ వాసనా సంయోగం వలన మనస్సు కొంచెం మెత్త పడుతుంది కానీ పూర్తిగా ద్రవించదు. కనుక సామాన్యంగా మెత్తబడిన లక్క వలె మనస్సు చలించి కైఠిల్యం చెందుతుంది. అందుతో వాసన అభావ మవుతుంది. వాసన పూర్తిగా ప్రవేశించలేదు. భగవద్విషయ "వాసన" విలక్షణం.

## పక్వాకారంగు

> ద్రవతా యాం ప్రవిష్టం సద్యత్కాఠిన్య దశాంగతమ్
> చేతః పునర్ద్రుతా పత్యా మపి తన్నైవ ముక్యతే

కరిగిన లక్కలో కలిపిన ఇంగిలీకపు రంగు అందులో మిళితమయ్యే ఉంటుంది. కాని అది విడిపోదు. ఆ విధంగానే చిత్తం ద్రవించినప్పుడు అంటిన కళ్వ

రాసక్తమైన వాసనలు చిత్తాన్ని వదిలిపోవు. అవి స్థిరంగా ఉండిపోతాయి. [illegible] సామాన్యంగా అంటీ అంటని రంగు గట్టిగా పట్టదు. అది వెలిసి పోతుంది లేదా ప్రిదిలి పోతుంది. ఇదే చిత్త శైథిల్యం. ఇది విషయాసక్త చిత్త స్థితి. ఇది అస్థిరం. ఇది వాసనాభాసం. చలనందీని సహజగుణం.

లక్కారంగువలె పూర్తిగా ద్రవీభూతమైన చిత్తంలో భగవత్ప్రేమ ప్రవేశిస్తే అదిపోదు. మరెన్ని పత్తిడులు వచ్చినా భగవత్ప్రేమ చలించదు. భగవత్స్వరూపం చిత్తంలో ముద్రపడితే అదియిక చిత్తాన్ని వదిలిపోదు. దీనినే 'వాసన' అంటారు. వాసన రెండు రకాలు. లౌకిక వాసన, పారలౌకిక వాసన.

బాగా కరిగిన లక్కకు రంగు అందినట్లు ద్రవీభూత చిత్తం భగవదాకారం పొంది స్థిరంగా ఉండి పోతుంది. భగద్భావ సంస్కారం చిత్తం ఒక్కసారి గ్రహిస్తే మరింక వదలదు. అందుకు ప్రహ్లాదుడే ప్రమాణం. అట్టి సంస్కారం గలవాడు భగవత్ ప్రేమలో పులకాంకిత గాత్రుడై ఈశ్వర ప్రేమ సముద్రంలో మునిగి ఉంటాడు. అట్టి భాగవతోత్తముడు నిరంత సాధనాభ్యాసంలో పరిపుష్ట హృదయుడై ధ్రువతారగా నిలిచిపోతాడు.

పానీయంబులు ద్రావుచున్ కుడుచుచున్ భాషించుచున్ హాస లీ
లా నిద్రాదులు చెందుచున్ తిరుగుచున్ లక్షించుచున్ సంతత
శ్రీ నారాయణ పాదపద్మయుగళీ చింతామృతాస్వాద సం
ధానుండై మరచెన్ సురారిసుతు దేతద్విశ్వమున్ భూవరా!

అని శుక మహర్షి పరీక్షిన్మహారాజుకి భక్త ప్రహ్లాదుని మనస్తత్వం వివరించాడు.

## స్థాయిభావం

స్థాయిభావ గిరాఽతోఽపి వస్త్వాకారోఽభిధీయతే
భక్తశ్చ రసతామేతి పరానంద తయాపునః

ద్రవిత చిత్తంలో స్థిరమైన వస్తువును "స్థాయిభావం" అనే శబ్దంతో ద్యోతకం చేస్తున్నారు బుధులు. అదే పరమానంద రూపంగా వ్యక్తమై రససిద్ధి పొందుతోంది. రస శాస్త్రంలో ప్రసిద్ధమైన "స్థాయిభావ" శబ్దార్థసిద్ధి కూడా చిత్త ద్రవీభూత స్థితి యేకదా! విభావ అనుభావ సంచారీభావ సంయోగం వలన అభివ్యక్తమయ్యేది స్థాయిభావం.

సభాసదులు తాదాత్మ్యకంగా ఏకం కావటం వలన సభాసద నిష్ఠ కలిగి పరమానంద సాక్షాత్కారం వలన రసత్వ ప్రాప్తి కలుగుతుంది: ఇది రసజ్ఞుల సిద్ధాంతం. రసవిదాం మర్యాదా అంటే రస శాస్త్రజ్ఞుల ద్వారా చేయబడిన వ్యవస్థ. ఇది నిరూఢ లక్షణ బీజరూపం. ఇది అనాది. భరతముని ఇలా అన్నారు: విభావ అనుభావ సంచారీభావ సంయోగం వలన రస నిష్పత్తి జరుగుతుంది. కనుక భక్తిని గూర్చి కూడా రసత్వ ప్రతిపాదన చేయుటకు స్థాయిభావ నిరూపణం జరిగింది.

## భగవాన్

భగవాన్ పరమానంద స్వరూపః స్వయమేవ హి
మనోగత స్తదాకారో రసతామేతి పుష్కలమ్

రమానంద స్వరూపుడైన భగవంతుడు స్వయంగా మానస పద్మాకరంపై సుస్థిరుడై స్థాయిరూపం పొంది రసత్వం దాల్చి ప్రకాశిస్తుంటాడు. స్థాయిభావ రసత్వ సిద్ధికి పరమానంద రూపత్వాన్ని ఉపపాదన చేస్తున్నాము. ఈ పరమానంద రూపుడగు భగవంతుడెవరు!

స్వామి బింబమై ఉపాధులైన ముఖ దర్పణాదుల్లో ప్రతీయమానమై ప్రతిబింబంగా గోచరిస్తుంటాడు. పరమాద్భుత పరమానంద స్వరూపుడగు భగవంతుని బింబమే మనోగతమై ఉపాధులలో ప్రతిబింబించి స్థాయిభావం పొంది రసరూపం పొందుతుంది. భక్తి రసం పరమానందం అనేది నిర్వివాద సిద్ధాంతం. ఆలంబన విభావం బింబం. స్థాయిభావం దాని ప్రతిబింబం.

ఒక సూర్యుండు సమస్తజీవులకు తానొక్కొక్కడై తోచు పో
లిక నేదేవుడు సర్వకాలము మహోలీలన్ నిజోత్పన్న జ
న్య కదంబంబుల హృత్సరోరుహములన్ నానావిధానూన రూ
పకుడై యొప్పుచునుండు నట్టి హరినే ప్రార్థింతు శుద్ధాంతనై!

## కాంతాదులు

కాంతాది విషయవ్యక్తికారణం సుఖచిద్ఘనమ్
కార్యాకారతయాత్మానేష్వప్యావృతం మాయయా స్వతః

కాంతాది లౌకిక విషయాలలో కూడా రస ప్రతీతికి కారణం సుఖ స్వరూప మైన చైతన్య స్వరూపమే. తదాకారంలో అభేదం అయినా మాయావరణంలో కప్పబడి ఉంటోంది.

ఆనందాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయంతే
ఆనందేన జాతాని జీవంతి
ఆనందం ప్రయంత్యభిసంవిశంతి

ఇది తైత్తరీయపాఠం. ఆనందం నుండి యే చరాచరాలు జన్మిస్తున్నాయి. ఆనందంలో జీవిస్తున్నాయి. ఆనందంలో లయిస్తున్నాయి. దీని వలన పరమానంద పర బ్రహ్మయే జగత్తుకు ఉపాదాన కారణం అని విశదమవుతోంది. "హే! సౌమ్య! ఈ సత్ రూపమే జగత్తుకు మూలమై మొదట్లో ఉన్నది" అంటున్నది శ్రుతి. 'ఈ జగత్తుయొక్క అనన్యత ఆరంభణ శబ్దాదుల వలన సూచింప బడుతోంది' అంటున్నది బ్రహ్మ సూత్రం. ఈ శ్రుతి బ్రహ్మ సూత్రాల వలన అఖండ ఆనందం అద్వైతం ప్రతీయమాన మవుతోంది. కానిది అంతా మాయావరణ విశేషములే.

వాస్తవంలో లేకపోయినా అనిర్వచనీయమైన ఒక వస్తువు నాదికానిది నాలో ప్రతీతమవుతోంది. మరొక్కసారి విద్యమానమై కూడా నాలో ప్రతీతం కాదు. అదే నా మాయ అన్నాడు శ్రీకృష్ణ భగవానుడు. దృష్టిదోషం వలన ఆకాశంలో రెండు చంద్రబింబాలు కనిపిస్తాయి. వాటిలో ఒకటి వాస్తవం. రెండవది అవాస్తవం. లేకపోయినా ఉన్నట్లు ప్రతీయమాన మవుతోంది. ఇదే విధంగా రాహువు చంద్రుడు ఉన్నారు. అంమలో రాహువు కనిపించడు. చంద్రుడు కనిపిస్తాడు. చంద్రుడు కనిపించక రాహువు కనిపిస్తే అది మాయ.

## సద్వస్తువు

సదజ్ఞాతశ్చ తద్బ్రహ్మ మేయం కాంతాది మానతః
మాయా వృత్తి తిరోభావే వృత్త్యాసత్త్వస్థయాక్షణమ్

సద్వస్తువు అసద్వస్తువు రెండూ బ్రహ్మమే. కాంతాది విషయిక వస్తువులు ప్రమేయాలు-పరిమితులు. మాయావరణం తిరోగమనం కాగానే క్షణమాత్రంలో ఉదయమయ్యే సాత్త్విక వృత్తి వల్ల చైతన్యం ద్యోతక మవుతుంది అది సద్వస్తువు. అజ్ఞాత శాసకుని ఏర్పాటు వలన అన్నిటికీ ప్రమాణాలున్నాయి. స్మృతి ప్రమాణం వలన ఎక్కువ వాటికి స్వయం ప్రకాశ శక్తి ద్యోతక మవుతుంది. స్వయంప్రకాశ

భాసమాన చైతన్యమే అజ్ఞాతంగా విరాజిల్లుతుంది. అది జడం కాదు. జడంలో ఏ ఆవరణ ఉండదు. జడంలో ప్రతిబింబం అనేదే లేదు. జడంలో అజ్ఞాతం అనేదే లేదు. కాంతాది విషయాంతు అవిచ్ఛిన్న చైతన్యమే ప్రమాణం.

సాత్త్విక ప్రమాణ జన్యమైన అపరోక్ష వృత్తి వలన ఆవరణ తొలుగుతుంది. అపుడుతత్తద విచ్ఛిన్న రూపం వలన పరమానంద విషయ ఉపాదాన చైతన్యం కలుగుతుంది. అజ్ఞాతం జ్ఞాతం అవుతుంది. అదే ప్రమాణం. కాంతాది జడ వస్తువులోని జడత్వం ఉండదు. సద్వస్తువులో చైతన్య భరితంగా ఉంటుంది. అయితే అందు అజ్ఞాతము ప్రకాశ్యమానమూ రెండూ ఉంటాయి. సద్వస్తువు స్వకాశం ఎన్నడూ భంగమయ్యేవి కావు.

## భావత్వం

అతస్తదేవ భావత్వం మనసి ప్రతిపద్యతే
కించ న్యూనాంచ రసతాం యాతిజాద్యవిమిశ్రణాత్

కాంతాదులందు కనిపించే ప్రేమ అయా కాంతల ముఖ కవళికలందే వ్యక్తమవుతుంది. కనుక కళ ద్రవీభూత చిత్తంలోనే ఆవిర్భవిస్తుంది. కానీ ఆదే జడత్వం అధికమైనపుడు రసస్థాయిని అందుకోలేదు. కానీ కొంత న్యూనంగా ప్రతిఫలిస్తుంది. జడత్వంలో కళ కనిపించదు అనే చెప్పాలి. విషయావిచ్ఛిన్న చైతన్యమే ద్రవీభూతమై మనోవృత్తిలో మారాకు వేస్తుంది. ఆ విధంగా ఆరూఢమై ప్రకాశించుట వలన భావమై తదుపరి రసత్వసిద్ధి పొందుతుంది. కనుక క్రమంగా లౌకికరసం పరమానంద రసరూపం దాలుస్తుంది. ఈ రీతికి ఆక్షేపణలేదు.

చిదానందుడైన భగవంతుడిపై విశ్వాసం గాఢంగా కలుగుట వలన భక్తి రసంలో ఆనందం అధికంగా అహరహంగా తైలధారవలె సాగుతుంది. కానీ లౌకిక రసంలోనూ ఆనందం స్ఫురిస్తుంది. అది కొంత కాలమే. అది విచ్ఛిన్నం. అశాశ్వతం. ఆది అల్పం. తక్కువ ఆనందం ఇచ్చేదాన్ని త్యజించి అత్యధిక శాశ్వతానందం ఇచ్చే భక్తి రసాన్ని సేవించటం శ్రేయస్కరం కదా!

## సాంఖ్యం

ఇతి వేదాంత సిద్ధాంతే స్థాయినో రస రోదితా
సాంఖ్య సిద్ధాంత మాశ్రిత్యాం వ్యదువా ప్రతిపాద్యతే

ఈ ప్రకారంగా వేదాంత సాంఖ్య సిద్ధాంతానుసారంగా స్థాయిభావ రసత్వ ప్రతిపాదన చేయబడింది.

## తమోరజస్సత్త్వాలు

తమోరజస్సత్త్వగుణా మోహదుఃఖ సుఖాత్మకాః
తన్మయీ ప్రకృతిస్తైస్తుః సర్వం కార్యంత తన్మయమ్

తమస్సు రజస్సు సత్త్వం అనేవి మూడు గుణాలు. వీని వలన క్రమంగా మోహం దుఃఖం సుఖం సంప్రాప్త మవుతాయి. ప్రకృతి ఈ త్రిగుణాత్మకం. ఈ ప్రకృతి ఉపాదాన కారణం. ఈ ప్రకృతి సుఖదుఃఖ మోహాత్మకం. మట్టి సామాన్య ప్రకృతిః ఘటానికి కారణం ఇదే. ప్రకృతిలోని సుఖం సత్త్వ గుణం. దుఃఖం రజో గుణం. మోహంతమో గుణం. ఈ త్రిగుణాత్మక ప్రకృతి కార్యకారణ మిశ్రితం.

## ముగ్గురు

త్రిగుణాత్మక మేకైకం వస్తు త్ర్యాకారమీక్ష్యతే
నిజమానస సంకల్ప భేదేన పురుషై స్త్రిభిః

సుఖ దుఃఖ మోహాత్మకులు ఒకే వస్తువును తమతమ మానసిక సంకల్ప భేదాల వలన మూడు తీరుల్లో భావిస్తారు. అంతర్బాహ్య పదార్థ తాదాత్మ్యం ప్రతిబింబిస్తుంది. కనుక అదే అంతర్పదార్థ మవుతుంది. అన్ని పదార్థాలు అందరికీ సమానంగా ఉండవు. ఆయా పదార్థాలు వారివారి మనస్తత్వాన్ని బట్టి, పూర్వ వాసనా బలం బట్టి దర్శనం ఇస్తుంటాయి.

## కామిని

కామిన్యా స్స్వభర్త్రా సపత్న్యా దుఃఖ రూపతా
తదలాభార్తదాక్షిణ్యేన మోహత్వ మనుభూయతే

ఒకే స్త్రీ భర్తకు సాత్త్విక సుఖదాయినిగా ఆనంద మిస్తోంది. ఆ స్త్రీయే తోటి సవతికి రాజసం కలిగించి ద్వేషం కలిగించి దుఃఖ కారణం అవుతోంది. ఆ స్త్రీయే కాముకుడికి దీనిని పొందాలనే మోహం కలిగించి అందుకు చేస్తోంది. వాసనా

భేదం వలన ఒకే వస్తువులో భిన్నభిన్న రూపాలు ప్రతీయమానమవుతున్నాయి. ఒకచోట ఈ విషయమే కుమారిలభట్టు ఇలా చెప్పారు—

> పరివ్రాట్ కాముక శునా మేకస్యాం ప్రమదా తనౌ
> కుణపః కామినీ భక్ష్యమితి తిస్రో వికల్పనాః

ఒకే స్త్రీ దేహం చూచి సన్యాసి కాముకుడు శునకం ముగ్గురూ మూడు విధాలుగా భావిస్తారు. సన్యాసి స్త్రీ దేహం స్పృశింప తగింది కాదు చీము నెత్తురు ముద్దగదా అనుకుంటాడు. కాముకుడు సంభోగించాలి తగినది అనుకుంటాడు. శునకం ఈ శరీర మాంసం ఎంత రుచియో! తిన తగింది అనుకుంటుంది. ఇవి సత్త్వ రజస్తమో జనిత సుఖ దుఃఖ మోహాత్మకాలు.

## స్థాయిభావం

> ఏవం సతి సుఖాకారః ప్రవిష్టో మానసే యదా
> తదా స స్థాయిభావత్వం ప్రతిపద్య రసోభవేత్

ఈ విధంగా ప్రతి ఒక వస్తువు వ్యక్తుల స్వభావాలు బట్టి సుఖ దుఃఖ మోహాత్మకంగా ఉంటుంది. సాత్త్వికుని మనస్సు సుఖాత్మకంగా ఉన్న వస్తువు వలన ద్రవీభూతం చెంది స్థాయిభావాన్ని పొందుతుంది. తదుపరి ఆ భావధ్యాన మననాదుల వలన రసరూపంగా పరిణమిస్తుంది. క్రోధాది భావాలు కూడా రజస్తమో గుణాల వలన మిశ్రిత సత్త్వం ఉద్రేకమై చిత్తద్రుతికి కారణం అవుతున్నాయి. ఒక రకంగా అవి కూడా సుఖ కారకాలే. చిత్తం యొక్క ద్రవీభావం సత్త్వ ధర్మం. ఇది లేకుండా స్థాయిభావం కలుగుట అసంభవం. సత్త్వం సుఖమయం. కనుక క్రోధాదులు కూడా సుఖాపేక్షితాలే. కానీ అవి రజస్తమో గుణ మిశ్రితాలగుటచేత వాటిలో తారతమ్యం అధికంగా గోచరిస్తుంది. కనుక అన్ని రసాలలోనూ కొంత కొంత సుఖానుభవం ద్యోతకమవుతోంది.

## పరమాణువు

> పరమాణ్వేక రూపంతు చిత్తం న విషయాకృతిః
> ఇత్యాది మతమన్యేషా మప్రామాణ్యా దుపేక్షితమ్

మనస్సు పరమాణువు. అది ఒక్కటే. అది నిత్యం. అది విభిన్న విషయాం లోనికి మార్పు చెందదు అని భావించే తార్కికులు మీమాంసకులు బౌద్ధ మతస్థులు అదిగాగల పండితుల అభిప్రాయం అప్రమాణికం. కాబట్టి వారివాదం ఉపేక్షణీయం.

తార్కికులు "మనస్సు నిత్యం. అది నిరవయవం. అణు పరిమాణశీలం. సావయవ లాక్షా దృష్టాంతం వలె ద్రవీభూత విషయంలో పరిణత మవుతుంది" అంటారు.

మీ మాంసకులు "మనస్సు నిరవయవం. కనుక దీనికి తక్కువ యెక్కువ హ్రస్వం దీర్ఘం, వృద్ధి క్షయం ఉండవు దీనికి స్థాయిభావ నిరూపణమే అసంభవం" అంటారు.

బౌద్ధులు "మనస్సు విభువు. ప్రతి ఉత్తర జ్ఞానం యెడల పూర్వ జ్ఞానం కారణమవుతోంది. ఆ కారణత్వం కలిగించేది మనస్సు. ఆ మనస్సు. నిత్యం విభువు" అంటారు.

సాంఖ్యులు "గొడ్డలి చెట్లను నరుకుతోంది. కనుక గొడ్డలి ఒక సాధనం అలాగే ఇంద్రియాలు మనః ప్రేరకాలు. మనస్సు ఒక పెద్ద ఇంద్రియం. మనస్సు అణువు కాదు. విభువు కాదు. మనస్సును అణువు అనటానికి హేతువు లేదు" అంటారు.

ఇంద్రియం గుణాన్ని గ్రహించి దాని వలన ఆరంభమై వ్యాప్త మవుతోంది. మనస్సు పంచభూతాల గుణాలు గ్రహించి గుణాల ప్రభావంతో ఆరంభమై వ్యాప్తమై ప్రసిద్ధి చెందసాగింది. పై తార్కిక మీమాంస బౌద్ధ వాదాలు ఇంచుమించు ఒక్కటే. ఇంద్రియాలు సజాతీయ జనితాలు. మనస్సు విజాతీయ పంచభూత జనితం. ఇచట విజాతీయ ద్రవ్య అనారంభకత్వం కూడా ఏమీ విశేషమైనది కాదు. సువర్ణం వట్టు దారం జలతారు రంగు కలసి వస్త్రం తయారు అవుతోంది. ఇక్కడ విజాతీయ అనారంభకత్వంలో ఏమీ విశేషం కనిపించదు.

ఒక ఇంద్రియం ఒక సమయంలో ఒక జ్ఞానం కలిగి వుంటుంది. మరొక సారి భిన్న భిన్న ఇంద్రియ జన్యజ్ఞానాలు ఒక్కసారిగా ఉత్పన్న మవుతుంటాయి. ఒక మధుర పదార్థం తిన్నప్పుడు శబ్ద స్పర్శ రూప రస గంధాలు ఒక్కసారిగా

అనుభవంలోనికి వస్తాయి. సుషుప్తి వలన త్వక్ మనస్సంయోగం జ్ఞాన మాత్రము గుటను నైయాయికులు వేదాంతులు అంగీకరిస్తారు. మనస్సు గతి స్వభావం గూర్చి శ్రుతులు స్మృతులు పెక్కుచోట్ల పేర్కొన్నాయి. దానిని బహు సంఖ్యాక పండిత వర్గం అంగీకరిస్తుంది.

## మనోరూపం

గృహ్ణాతి విషయాకారం మనోవిషయయో గతః
ఇతి వేదాంతిభి స్సాంఖ్యైరపి సమ్యన్నిరూపితమ్

విషయాసక్తమైన మనస్సు విషయాకారం వహిస్తుంది. ఈ సిద్ధాంతాన్ని వేదాంతులు సాంఖ్యులు కూడా నిరూపించారు. పూర్వం చెప్పినట్లు తార్కికులు మీమాంసకులు బౌద్ధులు చేసిన వాదాలు పరాభూతమైనవి. కనుక స్వాభావికమూ స్వచ్ఛమూ అయిన సావయవ పదార్థమైన దర్పణంలోని ప్రతిబింబాన్ని గ్రహించి అలాంటిదే అయిన మనలోని స్వాభావిక రూపాన్ని గ్రహించి వేదాంతులు సాంఖ్యులు నిరూపణం చేశారు. అది ప్రామాణిక విషయం అని తేలింది. కనుక అదే అంగీకారయోగ్యం అయింది. సాంఖ్యులు మనస్సును అహంకార జన్యంగా భావించారు. వేదాంతులు ఆకాశాది అపంచీకృత సాత్త్విక అంశం నుండి మనస్సు జనించిందిఅన్నారు. ఇక్కడే అంతరం కానీ మిగిలినవన్నీ ఏకాభిప్రాయములే ఉన్నాయి. విషయాకార గ్రాహకత్వంలో మనస్సు తీరును ఇరువురూ అంగీకరించారు.

## మూష

మూషానిక్తం యథాతామ్రం తన్నిభం దృశ్యతే తథా
ఘటాది వ్యాప్నువచ్చిత్తం తన్నిభం జాయతే ధ్రువమ్

బంగారం మొదలైనవి లోహాలను కరగించటానికి ఉపయోగించే మూసను బట్టి కరిగించిన లోహాదులు మూస ఆకృతులను వహిస్తాయి. ఆ విధంగానే వస్తువు వాసనా వృత్తుల వలన చిత్తం భావించిన స్వరూపం పొందుతుంది. రాగ ద్వేషాదులను బట్టి ద్రవిత చిత్తం విషయాలను అనుకూలంగా ఆకృతి పొందుతుంది. ప్రేమ అయినా ద్వేషం అయినా అంతే. దీనిని చిత్త శైథిల్యం అంటారు. ద్వేషాదులకు కూడా చిత్తం కరుగుతుంది. రాగ ద్వేషాదులు అంటని చిత్తం సుస్థిరమై కాఠిన్యం విశృంఖల పొంది ఉంటుంది.

## వస్తురూపం

> వ్యంజకో వా యథాలోకో వ్యంగ్యస్యాకారతామియాత్
> సర్వార్థ వ్యంజకత్వాద్ధీరర్థాకారా ప్రదృశ్యతే

వ్యంజకాలైన ఇతర పదార్థాలను ప్రకాశింపజేసే సూర్యాలోకం వ్యంగ్య ప్రకాశక వస్తురూపాకృతి ధరిస్తుంది. ఆ విధంగానే బుద్ధివ్యంజకం. కనుక తాను వస్త్వర్థరూపాన్ని స్వీకరించి కనిపిస్తుంది. చిత్తం విషయాకారం వహిస్తుంది. అది విషయగత ఆవరణను తొలిగిస్తుంది. సూర్యాలోకం ఈ అర్థంలోనే ప్రమాణం. ఆలోక సంయోగం ప్రత్యక్ష అసాధారణ కారణం. వ్యంజక ఆలోకం వస్త్వాకారం పొందుటను జరగకపోతే వస్తుగత ఆవరణ నివృత్తికాదు. ఆవరణ భంగమే వృత్తిమాత్ర ప్రయోజనం.

## శంకరాచార్య

> భగవత్పూజ్యపాదానామియా ముక్తి స్స్వయుక్తికా
> తథా వార్తికకారైరవ్యయమర్థో నిరూపితః

శ్రీ భగవత్పాదులైన శంకరాచార్యులవారి ఈ ఉక్తి వ్యంజకం యుక్తి సంగతం. వేదసమ్మతం. వారి శిష్యులు వార్తికకారులు అయిన సురేశ్వరాచార్యాదులు ఈ భావాన్నే నిరూపించారు. 'వ్యంజకో వా' ఇత్యాది సూక్తులు శ్రీ సురేశ్వరాచార్యులవి. యుక్తి-అనుమాన-రూపం వచన పంచావయవ వాక్యాదుల నుండి ఇది సిద్ధం చేసి చూపదమైనది.

'శంకరులు సాక్షాత్ శంకరులు' అని ప్రశంసలు పొందారు. శ్రీ సురేశ్వరాచార్యులు మహోద్దండ కర్మనిష్ఠా గరిష్ఠులు వీరు సాక్షాత్ శంకరాచార్యులనే యెదుర్కొని వాదించి చివరకు ఆచార్యులకు అత్యంత ఆప్తులైన అంతేవాసులైనారు. ఈయన భార్య ఉభయ భారతి. సాక్షాత్తు బ్రహ్మ భార్యయైన సరస్వతీ దేవియే. మహా విదుషీమణి. శంకరుల సురేశ్వరుల వాగ్వివాద మహా పరిషత్తుకు ఈమెనే మధ్యవర్తినిగా ఎన్నుకొన్నారు శంకరులు. వార్తిక కారులుగా సురేశ్వరాచార్యులు సుప్రసిద్ధులు. శంకరులు సురేశ్వరులు భక్తి విషయంలో ఇదే దృఢం చేశారు.

## పోలికలు

మాతు ర్మానాభినిష్పత్తిర్నిష్పన్నం మేయమేతి తత్
మేయాభిసంగతం తచ్చ మేయాభత్వం ప్రపద్యతే

('మాతు' అంటే చిత్ అచిత్ గ్రంధియొక్క సచేతనమైన అంతః కరణ ద్రవం. 'మాన' అంటే అచేతనమైన వృత్తి రూపజ్ఞానం. 'మేయమ్' అంటే ఘటాది విషయ జ్ఞానం. 'మేయాభత్వం' అంటే ఘటాధుల ఆకారం.)

మాత అనే అంతఃకరణ ద్రవం నుండి మాన అనే జ్ఞానం కలుగుతుంది. అది ఆ విధంగా కలిగిన ఘటాది విషయం ప్రాప్తిస్తుంది. మరల అది అవిధమైన ఘటాది విషయంతో కలిసి అవృత్తి రూప జ్ఞానం వృద్ధి పొంది ఘటాద్యాకారం పొందుతుంది.

నదీజలం పిల్ల కాలువల ద్వారా పొలాలను చేరుతుంది. ఆ కాల్వలతూ నదీ జలానికి సంబంధం గాఢంగా ఉంటుంది. పొలం మడి చేరిన జలం మడి ఆకారం పొందుతుంది. అయినా నదితో సంబంధం పెట్టుకొనే ఉంటుంది. ఆ విధంగానే ఘటాది విషయాలలో సంబంధం గల వృత్తి రూప జ్ఞానం తదాకారం వహిస్తాంటుంది. దీని తదుపరి దానితో చైతన్యం అభివ్యక్తియగుట వలన ఘటాదులుగా ప్రతీతి వచ్చింది. ఈ యావత్ ప్రక్రియా విభాగం గూర్చి శ్రీ మధుసూదన సరస్వతి తన 'సిద్ధాంత కౌముది'లో వివరించారు.

## విషయాకారం

ఏవమేతాదృశ వాక్య ముదాహార్య మనేకశః
చిత్తస్య విషయాకార గ్రాహకత్వోపపాదనే

ఈ విధమైన చిత్త విషయాకార సంబంధంగా ఉతష్ఠాధకుడేసే వాక్యాలు అనేకం. కనుక అధిక సంఖ్యలో ఉదాహరణలిచ్చి గ్రంథ విస్తరణం చేయదలచ లేదు. అది ప్రయాసం కదా!

## మాంసమయి మనోమయి

అతో మాంసమయీ యోషిత్ కాచిదన్యా మనోమయీ
మాంసమయ్యా అభేదేపి భిద్యతేత్ర మనోమయీ

మనస్సు ద్వారా ప్రదీభూత విషయాకారం పొందటం చేత మాంసమయమైన మహిళ వేరు, మనోమయమైన మానినీమణి వేరు. మాంసమయితో అభేదకత్వం పొందినా కూడా మనోమయి భిన్నంగానే వ్యక్తమవుతుంది. శ్రీ విద్యారణ్యస్వామి 'పంచదశి' లో ఈ భావం వివరించారు. ఈ విషయానికి దానిని ఉపసంహారంగా సూచింపబడింది. మనోమయితో ఆకార భేదం లేకుండా ఒకే భౌతిక పిండ దేహం వ్యవహారంలో పని చేస్తుంటుంది. మనస్సు స్థూల పదార్థాలతో కాక సూక్ష్మ సృష్టికి కల్పన చేస్తూంటుంది.

## ఒకే స్త్రీ

భార్యా స్నుషా ననాందా యాతా మాతేత్యనేకధా
జామాతా శ్వశురః పుత్రః పితేత్యాది పుమానపి

ఒకే మాంసమయి అయిన మహిళ ఒకనికి భార్య, ఒకనికి కోడలు, ఒకరికి ఆడపడుచు, ఒకరికి వదిన, ఒకనికి మరదలు, ఒకనికి తల్లి, ఒకనికి చెల్లి. ఇలా ఒకే స్త్రీ పలువురికి పలువిధాలుగా సంబంధం కలిగి వుంటుంది. ఈ విధంగానే ఒకే పురుషుడు ఒకరికి భర్తగా మరొకరికి మామగా, కొడుకుగా, అల్లుడుగా, తండ్రిగా పలువురికి పలు సంబంధాలు కలిగి ఉంటాడు.

భౌతికంగా మాంసమయ శరీరంలో ఏ మార్పు లేదు. మానసిక కల్పనలోనే తేడా. మాంసమయ శరీరం అదే అయినా మానసిక సంస్కారాల వల్ల ఆ వ్యక్తి అలా కనిపిస్తాడు. భావించబడతాడు. మనోమయి వేరు. మాంసమయి వేరు. మనస్సు తన సంపు సంస్కార స్థాయిని బట్టి ఎదుటివ్యక్తిని ఆ విధమైన కల్పన చేస్తుంది.

## స్థూలం సూక్ష్మం

బాహ్యపిండస్య నాశేపి తిష్ఠత్యేవ మనోమయః
అతః స్థాయీతి విద్వద్భిః అయమేవ నిరూపితః

లౌకిక బాహ్య పిండం' మాంసమయ దేహం అది నశించేది. మనోమయ దేహం సూక్ష్మం. సూక్ష్మదేహం కారణదేహం నశించేవి కావు. విద్వాంసులు భక్తి స్థాయిభావంగా నిరూపణ చేశారు. మాంసమయ దేహం ఒకటి. కాని మనోమయ దేహాలు అనేకం. ఏకత్వం అనేకత్వం ఒక వైధర్మ్యం ఇది. వినాశిత్వం అవినాశిత్వం ఇదీ వైధర్మ్యం. 'నాశేఽపి' శబ్దంలో 'అపి' వలన బాహ్య వస్తువులకు దేశ కాలాదుల వలన వ్యవధానం ఉన్నా మనోమయాలు వ్యవధాన రహితాలు. బాహ్య పిండం నాశీలం. మనోమయం అవినాశి. 'అపి' శబ్దం సముచ్చయార్థకం అగుట వలన రెండు అర్థాలు ద్యోతకం అవుతాయి.

## మనోమయం

ఏవం సామాన్యతో భావస్వరూప ముపదర్శితమ్
విశేషేణతు సర్వేషాం లక్షణం వక్ష్యతే పృథక్

ఈ విధంగా సామాన్యరూపం నుండి స్థాయి భావం వరకు నిరూపించాను. విశేషంగా వేరు వేరు లక్షణాలు వివరిస్తాను. మనోమయ విషయం అవినాశి కాదు దేశ స్థాయిభావ సిద్ధి లభించింది. స్థాయిభావం రతి కోసం మొదలైనవి ముందు ముందు ఉల్లేఖించబడతాయి.

## స్వామి

భగవంతం విభుం నిత్యం పూర్ణబోధ సుఖాత్మకమ్
యద్గృహ్ణాతి ద్రుతం చిత్తం కిమన్య దవశిష్యతే

స్వామి సర్వమునకు స్వామియే. ఆ స్వామి విభుడు అందరికీ ప్రభువు. సర్వ వ్యాపకుడు. సర్వకాలాలలో విరాజిల్లుతాడు. నిత్యుడు. సర్వ పూర్ణ స్వరూపుడు. పరమేశ్వరుడు. అద్వైతమూర్తి జ్ఞాన ప్రబోధకుడు. స్వామి సర్వజ్ఞుడు సర్వేశ్వరుడు. సర్వసుఖ స్వరూపుడు.

అట్టి భగవంతుని ద్రవీభూత చిత్తంతో ఏ భక్తుడు ఏ విధంగా భావనచేస్తే ఆ విధంగా సాక్షాత్కరించి ఉద్ధరిస్తాడు. స్వామి చేయలేని పని యేముంది! భగవంతుని ఆకారం ద్రవీభూత చిత్తంలో ఒదిగి పోతుంది. అనాది కాలం నుండి భగవం

తుడు భావ చిత్రాలు అసంఖ్యాకంగా వెలువరిస్తున్నారు. భక్తుడిలో భగవచ్చిత్రం ఒక్కటే స్థిరంగా ఉంటుంది. స్వామి కరుణతో ఆ భక్తుడు కృతకృత్యుడవుతాడు. సూర్యోదయం కాగానే నక్షత్రాలు మాయమైపోయినట్లు స్వామి సాక్షాత్కరించగనే క్షణిక కాంతిపుంతులు అల్పులు కాకన శిలుడు వలాయనం చిత్తగిస్తారు.

## కఠినం

కఠినా శిథిలావాదీ ర్నగృహ్ణాతి నవాస్యతే
ఉపేక్ష జ్ఞాన మిత్యాహు స్తద్బుధాః ప్రస్తరాదిపు

కఠినుడూ ద్రవీభూత చిత్తం కానివాడూ భగవదాకారం గ్రహించలేడు. కఠినం కాకపోయినా శిథిల మనస్కుడుసూ భగవద్భక్తి పొందలేడు. ద్రుతి చెందని చిత్తంలో భగవదాకారం స్థాయిభావం చెందదు. విద్వాంసులు రాళ్ళలో మొద్దులలో ఉపేక్షా జ్ఞానమే దర్శించారు.

స్మృతి - అనుభవం - ఉపేక్ష అని న్యాయవార్తికంలో జ్ఞానం త్రివిధం అన్నారు. స్మృతి-అనుభవాలు సదా అపేక్షణీయాలు. ఉపేక్ష ఉపేక్షణీయమే. ఉపేక్ష జ్ఞానం గల అంతఃకరణంలో సుఖం లేదు. రాగం లేదు. దుఃఖం లేదు. ద్వేషం లేదు. దారినపోయే బాటసారికి దారి ప్రక్కగల రాళ్ళను గూర్చి దుఃఖమూ ద్వేషమూ సుఖమూ ఏమీ లేవు. వాటి యెడల ఉపేక్షయే. చిత్తం ద్రవించక పోవటం కాఠిన్యం. కొంచెం మెత్తబడడం శైథిల్యం. ఈ రెండూ భక్తిని గ్రహించలేవు. ఇవి ద్రవీభూత సాధకాలు కావు.

## మృదువు

కాఠిన్యం విషయే కుర్యాత్ ద్రవత్వం భగవత్పదే
ఉపాయైః శాస్త్రనిర్దిష్టైః అనుక్షణం మతో బుధః

బుధుడు భక్తి శాస్త్ర గ్రంథాలలోని ఉపాయాలు తెలుసుకొని చిత్తాన్ని లౌకిక విషయాలలో కాఠిన్యం-భగవద్విషయాలలో మృదువు అయ్యేలా ప్రయత్నం చేస్తూండాలి. శీతలం జల స్వభావం. ఉష్ణం అగ్ని స్వభావం. సంచరణం వాయు స్వభావం. అట్లే అనాది కాలం నుంచి ద్రవీభూత చిత్తంలో ప్రవేశించిన ప్రియ అప్రియాది విషయాలను వ్యాప్తం చేయటం చిత్తం స్వభావం. దేని నిజ స్వభావం

అది వదులుకోలేదు. విషయాకారం వహించటం చిత్తం స్వభావం కాదు. చిత్తం జాగ్రదవస్థలో ఇంద్రియాలకు వేరుపై స్థూల విషయాలు గ్రహిస్తుంది. అంతటితో స్థూల విషయాకారం పొందుతుంది. స్వప్నంలో స్థూల విషయాలకు ఇంద్రియాలు దగ్గరగా ఉండవు. కేవలం మనోగత వాసనలే ఉంటాయి. అందువల్ల సూక్ష్మ విషయాకారత మాత్రమే వహిస్తుంది. సుషుప్తిలో ఇంద్రియాలు మనోగత వాసనలూ రెండూ చిత్తం దగ్గరకు రావు. అపుడు చిత్తం నిర్విషయకంగా ఉంటుంది. సుషుప్తిలో చిత్తం లయం చెందుతుంది. ఆ స్థితిలో చిత్తం ఏ విషయమూ స్వీకరించదు.

## నారదుడు

ఉపాయాః ప్రథమస్కంధే నారదే నోపవర్ణితాః
సంక్షేపాత్తానహం వక్ష్యే భూమిభేద విభాగతః

శ్రీ నారద మహర్షి విశ్వ శ్రేయోభిలాషి. నిత్య సంతోషి. బ్రహ్మ మానస పుత్రుడు. పరమ పవిత్రుడు. భక్తుడు. భక్తులకు ఆప్త మిత్రుడు. ఈ దేవర్షి భక్తి మార్గానికి ఆచార్యుడు. ఈయన ఒకరోజు సరస్వతీ నదీ తీరంలో వ్యాకులంగా ఉన్న వ్యాస మహర్షిని చూచి ఇలా అన్నాడు– నీవు వేద వేదాంగాలు విభజించావు. అష్టాదశపురాణేతిహాసాలు వ్రాశావు భక్తి రస ప్రాధానంగా ఏమీ వ్రాయలేదు. నీ, వ్యాకులతకిదే కారణం. నీవు పరమ భక్తి పూర్ణంగా భాగవతం వ్రాయి. బ్రహ్మానందం పొందు.

అవశబ్దంబులఁగూడియున్ హరిచరిత్రాలాపముల్ సర్వపాప
పరిత్యాగము సేయు గావున హరిన్ భావించుచున్ పాడుచున్
జపముల్ సేయుచు వీనులన్ వినుచు నశ్రాంతంబు కీర్తించుచున్
తపసుల్ సాధులు ధన్యులౌదురుగదా! తత్త్వజ్ఞ! చింతింపుమా!

వ్యాస మహర్షి నారదుని ప్రేరణతోనే భాగవతం రచించాడు. అందులోని ప్రథమ స్కంధంలో నారదుడు ప్రబోధించిన ఏకాదశ భక్తి భూమికల విభేదాలను వ్యాసుడు సంగ్రహవం చేశాడు. అవి సంక్షేపంగా ఇవి- అని శ్రీ మధు సూదన సరస్వతి వివరిస్తున్నాడు.

## ఏకాదశ భూమికలు

ప్రథమం మహతాం సేవా తద్దయా పాత్రతా తతః
శ్రద్ధాథ తేషాం ధర్మేషు తతో హరిగుణ శ్రుతిః

తతో రత్యంకురోత్పత్తిః స్వరూపాధిగతి స్తతః
ప్రేమవృద్ధిః పరానందే తస్యాథ స్ఫురణం తతః

భగవద్ధర్మ నిష్ఠాఽత స్స్వస్మిం స్తద్గుణశాలితా
ప్రేమ్ణోఽథ పరమాకాష్ఠే త్యుదితా భక్తి భూమికాః

1. మహత్సేవ 2. దయా పాత్రత 3. ధర్మశ్రద్ధ 4. హరిగుణ శ్రవణం 5. భగవద్రతి అంకురార్పణ 6. స్వరూపాధిగతి 7. ప్రేమ వృద్ధిలో పరానందం 8. దైవ స్ఫురణం 9. దైవ ధర్మ నిష్ఠ 10. హరిగుణ శాలినత 11. ప్రేమ పరాకాష్ఠ ఇవి ఏకాదశ భక్తి భూమికలు.

1. మహత్సేవ— భక్తుడు సేవావ్రతం పట్టాలి. మాతృదేవో భవ-పితృదేవో భవ-ఆచార్యదేవో భవ-అతిథిదేవో భవ ఈ క్రమంలో అందరినీ ఆదినారాయణ మూర్తులుగా భావించి సేవించాలి. ప్రతి వానిని పరమేశ్వరుడని తలచిన సేవలు అందించాలి. ఆదుకోవాలి. ఆదరించాలి. సమాజం సర్వేశ్వరుడు. విశ్వం విష్ణువు. భక్తుడైన సేవకుడు భగవంతుని సేవ. సేవా యోగంతో భక్తి యోగం ప్రారంభమవుతుంది. హృదయం గర్వ అహంకార దూరమవుతుంది. సేవా వ్రతానికి మించింది మరిలేదు.

భగవాన్ శ్రీ సత్య సాయిబాబా సేవను గూర్చి ఇలా అన్నారు— "సేవకు ప్రధానం దయ-వినయం-త్యాగం. ఇట్టి గుణాలు కలిగిన వ్యక్తి మాత్రమే స్వార్థ రహిత సేవలు సలిపి జగత్తుకు ఆదర్శాన్ని అందివ్వగలడు. అహంకారం, అధం బరం, అభిమానం, గర్వం గలవాడు సేవ చేయలేడు. అహంకారం మహత్తమూల తత్త్వాన్ని విమర్శిస్తాడు. అభిమానం వలన పశువు అవుతాడు అహంకార అభిమానాలున్నవాడు ఆత్మ విశ్వాసం అందలేడు. ఆత్మ విశ్వాసం లేనివాడు తనను తాను నమ్మలేడు. వాడేమి చేయగలడు! దైవ ప్రీతిం గలవాడు సర్వేశ్వరునికి సర్వాత్మ భావంతో సలిపే కర్మయే సేవ. ఎవరికో సేవ చేస్తున్నాను అనే భావం మనస్సులో ఏ మాత్రం రానీయరాదు. త్యాగంతో సేవ చేయాలి.

"చిత్త శుద్ధిని చేకూర్చు సేవ కొరకు
జీవితము నంకితము చేసి వెలుగు నరుడ!
పరుల కొరకగు నీ శక్తి బలము తుదకు
చివరి శ్వాసము వీడుమా! సేవలోన...."

\- శ్రీ సత్యసాయి

2. దయాపాత్రత— భక్తుడు సేవా శుశ్రూషలతో మహాత్ముల మానసం చూరగొనాలి. భగవద్భక్తుల పరీక్షలలో నెగ్గి వారి దయకు పాత్రులు కావాలి. అన్యుల మెప్పులకు కాక ఆత్మ సంతృప్తిగా జీవనం పావనం కావాలి. సహనం క్షమం ముఖ్యం. ప్రహ్లాదాదులను ఆదర్శంగా తీసుకోవాలి. భక్తమహాత్ముల దయకు భగవంతుని దయకు ఇదే మార్గం.

3. ధర్మశ్రద్ధ— భక్తుడు ధర్మ కర్మలందు శ్రద్ధ కలిగి ఉండాలి. విశ్వాసం లేనివాడికి వేద ధర్మాలు అలవడవు. ధర్మం బహు విధాలు. మహాత్ముల సత్సాంగత్యంతో ధర్మ నిర్ణయం జరుగవలసియున్నది. ధర్మ కార్యాచరణం ఆదర్శవంతుల అడుగు జాడలలో ఆచరించాలి. వివేకం గలవాడు దైవధ్యానం అనే ఆత్మ ప్రబోధం అనే ఖడ్గంతో కర్మ బంధాలు త్రెంచుకొని పరమపదం చేరుకోవాలి. తన ధర్మ మార్గములందు మిక్కిలి శ్రద్ధ కలిగి ఉండాలి. పుణ్య పురుష సంసేవనం వలన పాపహరణమై అవతార పురుష సందర్శనం కల్గుతుంది. సాంగత్య సంసేవనం వలన ధర్మమందు శ్రద్ధ దృఢతరమవుతుంది. దీనితో భగవత్కథారుచి అధిక మవుతుంది. తత్ఫలితంగా లౌకిక కాంక్ష త్యాగం మారికతాను రాగం కలిగి భక్తి యోగానికి ఆసనం తయారవుతుంది. శ్రద్ధ లేనివాడికి భక్తి కుదరదు. భక్తి ముక్తి పథానికి పాథేయం. భక్తి శక్తినిస్తుంది. ఆసక్తి కల్గిస్తుంది. అనురక్తిని వృద్ధి చేస్తుంది. ధర్మంగూర్చి ధర్మ వ్యాధుడు కౌశిక బ్రాహ్మణునకు ఈ విధంగా బోధ చేశాడు—

తన కులధర్మము విడువక
మమత పరమధర్మమన్నాడు మామ్యాలు-చిత్తం
బుధ కృప గణింగుట ముఖ్యము
వని సైరణవలయు అఖిల భావములందున్!

కూర హితంబుగా వలుకు బొంకును సత్యఫలంబునిచ్చు భ
ద్ర్యాతదయాస్పదంబగు ప్రకూతపుసత్యము బొంకునట్ల ప్రా
ణాతురుడైనచో వరియణంబునయందున వల్కు బొంకు స
త్యాతిశయంబయం ద్రు మహితాత్మక! ఇట్టివి ధర్మ సూక్ష్మముల్
— ఎఱ్ఱన

4. హరిగుణ శ్రవణం— భక్తుడు భగవద్గుణ శ్రవణం కడు శ్రద్ధా భక్తులతో నిర్వహించాలి. శ్రవణం అంటే శ్ర వ ణ, కీ ర్త నా ది నవవిధ భక్తులు వస్తాయి.

తను హృద్భూషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా
ర్చనముల్ సేవయు ఆత్మలోనెరుకయున్ సంకీర్తనల్ చింతనం
బను నీతొమ్మిది భక్తిమార్గముల సర్వాత్మున్ హరిన్ నమ్మి స
జ్జనుడై యుండుట భద్రమంచు తలతన్ సత్యంబు దైత్యోత్తమా!
• భాగవతం

5. భగవద్రతి అంకురార్పణ— భ గ వం తు ని పై ప్రేమ అంతరంగ క్షేత్రంలో దృఢమైన వృక్షమై వృద్ధి పొందటానికి అనుకూల పరిస్థితులు ఏర్పడి నాయి. ముందు చెప్పిన సేవ దయ శ్రద్ధ గుణ శ్రవణాదులు ప్రేమ వృక్షం వృద్ధి కావటం కోసం పాదు, ఎరువులు, నీరు, వాతావరణాల వలె పనిచేసియున్నాయి. ఇపుడు రత్యంకురోత్పత్తి ప్రారంభమయింది. ఇందు రతి అనగా ప్రీతి, ప్రేమ, అనురాగం, ఆసక్తి అదిగా గల అనేక అర్థాలు స్ఫురింప చేస్తాయి. భగవద్రతి భగవత్ భక్తికి ద్యోతకం. భాగవత ధర్మాసక్తుల వలన భగవంతునిపై నిష్ఠ దృఢ మవుతుంది.

ఇందు భక్తిరసమే స్థాయి భావమై ద్రవీభూత చిత్తంలో ప్రవేశించి భగవదా కారం సంతరించుకొను సంస్కార విశేషమే రతి. ఈ రతి భాగవత ధర్మానుష్ఠాన పరంగా ప్రారంభం కావటమే బీజాంకురం. ఇందు బీజారోపణమై అంకురం మొల కెత్తింది. అదనులో సజ్జన సాంగత్యం హరిగుణ శ్రవణాదుల ద్వారా హృదయ క్షేత్రం సుఖమయమై పదునులోకి వస్తుంది. ఈ సుఖం మోక్ష దాయకం. ఇదేరతి ప్రారంభదశ. ఇక భక్తి రసానుభవంలో శ్రద్ధ దృఢమై రతి రూప స్థాయి భావం కలిగుతుంది. ఈ విధంగా అజ్ఞానం అంతరించి భగవత్ప్రీతి వృద్ధి చెంది ఆనందం లభ్యం అవుతుంది.

## స్వరూపాధిగతి

భగవత్స్వరూప సాక్షాత్కార అభివృద్ధి ఇందు సూచితం. రత్యంకురోత్పత్తి అయిన తర్వాత స్వరూప సాక్షాత్కారమే కలిగేది. ఈశ్వర సుందర స్వరూపాలు అనేకం అంతరంగంపై అనవరతం దృశనిమాన మవుతుంది. అవి స్థూల రూపాలు సూక్ష్మ రూపాలు. భగవద్రతి అధిగతి జెందుతుంది. భక్తుని సంశయ గ్రంధి తొలిగిపోతుంది.

ఆత్మ అనాది. ఆత్మ అమృతం. ఆత్మ నిర్గుణుడు-పరుడు. ప్రత్యగ్ధాముడు తాను స్వయం జ్యోతి స్వరూపుడు. సంపూర్ణ జగత్తును ప్రకాశింప జేస్తున్నాడు. ఇది పరమాత్మ వ్యాపక సూక్ష్మ స్వరూపం. పరమాత్మ జీవకోటి హృదయంలో వసించి ప్రకృతి పురుషుడైనాడు. ప్రకృతి లీలలలో జేరి గుణమయుడైనాడు. మాధవుడు మానవుడైనాడు. అవతారాలెత్తి అవనీఖండం పాలింపసాగాడు. పరమాత్మ భావాత్మకంగా లోక వ్యవహారం చూడసాగాడు. ఇది పరమేశ్వర స్థూల రూపం.

ఆత్మ నిత్యం సత్యం. శుద్ధం. అవ్యయం. ఏకం. అనేకం. అవ్యయం. ఆశ్రయం. నిర్వికారం. సాకారం. దర్శనహేతువు. సంగసహితం. వ్యాపకం అనావృతం అయిన పరమాత్మ జీవాత్మలో ఉన్నాడని గుర్తించాలి. "తత్త్వమ్"లోని తత్ పరమాత్మ,త్వమ్ నీవు అయియున్నావు. పరమాత్మ జీవాత్మలో తాదాత్మ్యమే తత్త్వ రహస్యం. వైరాగ్యం జ్ఞాన భాగ్యం కలిగిస్తుంది. శుష్కతర్కం జ్ఞానం హరిస్తుంది. అనేక జ్ఞాన స్రోతస్సులు భక్తి సరోవరంలో చేరుతుంటాయి. జ్ఞాన వాహినుల జీవనం భక్తి జలం.

## ప్రేమవృద్ధి

భక్తుడు భగవత్ప్రేమను క్రమక్రమంగా వృద్ధి చేసుకోవాలి. ఒక్కొక్క సోపానం అధిగమించాలి. అభ్యాసం అనుష్ఠానం ఆత్మ సంయమనం నిత్యాచరణలో నిలిచి పోవాలి. కష్టాలకు నష్టాలకు క్రుంగి సంయమనం త్యజించరాదు. భక్తుడు కామ క్రోధ మద మోహ మాత్సర్యాదులను జయించాలి. సర్వదా సర్వేశ్వర రతి కలిగి ఉండాలి భగవల్లీలా గాథలు విని పులకించాలి. బాధలు భరించవలసినప్పుడు 'భగవల్లీల' అని భగవంతునికే విందువుగా భావించి భజించాలి. భగవదాలంబనమే భవసాగరం దాటే నావ. భగవత్ప్రేమ భక్తునికి జీవగఱ్ఱ.

## తదాకారస్ఫురణ

భగవంతుని కొలుచు క్రమంలో భక్తుడు భక్తి భూమికలు అధిరోహించి భగవదాకారస్ఫురణము పొందాలి. పర్వేశ్వర సాక్షాత్కారానికి ఇదే మార్గం. అది మధురామభూతి. దివ్యామభవం. అది అనిర్వచనీయ అనుభవం. శ్రీ కృష్ణ భగవానుడు ఈ భూమికలో భక్త మానస స్థితిని ఇలా చెప్పారు– నా పాద పద్మారాధనలో లీనమైన భక్తుడు మోక్షం వస్తుందన్నా వెళ్ళడు. నా భక్తుని దృష్టిలో మోక్ష సామ్రాజ్య పదవి అత్యల్పం. నా భక్తులు నన్ను వదలి ఉండలేరు. మరొక విషయం పైకి వారి మనస్సు పోదు. వారి మనస్సు నా చుట్టూ తిరుగుతూ ఉంటుంది. వారికి నా స్ఫురణ కాక మరొకటి యుండదు. సర్వదా నా స్ఫురణే స్ఫురణ. నా స్మరణే స్మరణ. నా కరుణే వారు కోరునది. ఎప్పుడు నారాయణ మంత్ర పారాయణమే! నన్ను ప్రతివాదా కోరుకుంటాడు. "హే ప్రభూ! హే కృష్ణా! హే దేవకీ నందనా! నందనందనా! హే హరీ! మురారీ! హే గోపాలక! హే కృపా జలనిధీ! హే సింధు కన్యాపతే! మనఃపతే! స్వామీ! హే కంసాంతక! హే జగత్త్రియగురో! హే పుండరీకాక్ష! మమ్ము సర్వదా కాపాడ వలసింది" ఇవే పలుకులు.

కులశేఖరులు శ్రీకృష్ణ దేవుని ఇలా శరణాగతి చేశారు-

హేగోపాలక! హేకృపాజలనిధే! హేసింధుకన్యాపతే!
హేకంసాంతక! హేగజేంద్రకరుణాపారీణ! హేమాధవ!
హేరామానుజ! హేజగత్త్రయగురో! హేపుండరీకాక్ష! మాం
హేగోపీజననాథ! పాలయ! పరం జానామి! నత్వాంవినా!

ముకుందమాల

## ధర్మనిష్ఠ

భక్తుడు భాగవత ధర్మాలు నిష్ఠా గరిష్ఠుడై పాటిస్తుంటాడు. అతడు సత్కార్యాచరణం సత్కాలాచరణం అనుష్ఠానం ధర్మ ప్రవర్తనం గల క్రమబద్ధ జీవనం సాగిస్తుంటాడు. అన్న పానాదుల విషయంలో ధ్యాన మనన అనుష్ఠాన కార్యక్రమాలలో మహత్ సేవా శుశ్రూషాదుల విషయంలో మనోవాక్కాయ కర్మ నిర్వహణలో అనుక్షణం అతి జాగరూకుడై ఆత్మ ప్రబోధం అనుసరించి ప్రవర్తిస్తాడు. స్వార్థానికీ, అలసత్వానికీ ఆస్కారం ఈయడు. ఇట్టి భక్తులు రెండు రకాలు. 1. శుకాదులు సాధనద్వారా సర్వేశుని చేరినారు. 2. గోపికాదులు సహజ సిద్ధులు. వీరు ప్రేమతోనే దేవుని పొందారు.